నవతెలంగాణ

1

మెదక్

బుధవారం | 12 మార్చి 2025 | www.navatelangana.com

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి

-జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ స్వాతి రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట



ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలనీ జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ స్వాతి రెడ్డి సూచించారు. మంగళవారం రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్ పర్సన్ సాయి రమాదేవి ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా జైలును మంగళవారం ఆమె పరిశీలించారు. ఖైదీల వంట గది, స్టోర్ రూమ్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జిల్లా జైలు సూపరింటెండెంట్‌ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖైదీలందరికి అడ్వకేట్స్ ఉండాలని తెలిపారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ వారానికి నాలుగు సార్లు జైలుని సందర్శిస్తారని, అడ్వకేట్స్ లేనివారికి లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్ న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. పోక్స్ చట్టం గురుంచి వివరించారు. తొందరపాటు పనులతో తప్పులు చేయవద్దు అని తెలిపారు. ఖైదీల హక్కుల గురుంచి వివరించారు. పోలీస్ వారు అరెస్ట్ చేసే సమయములో ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని అడగవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్, శ్రీకర్ రెడ్డి, వెంకటేష్, జైలు సిబ్బంది, న్యాయసేవ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లు జీవిత ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి

రీజినల్ పీఎఫ్ కమీషనర్ విశాల్ అగర్వాల్

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఈపీఎఫ్ఓ పెన్షనర్లు తమకు ప్రతి నెలా పెన్షన్ రావాలంటే, ప్రతి ఏడాది కచ్చితంగా జీవిత ధృవీకరణ పత్రాన్ని, వారు జీవించి ఉన్నారని రుజువు చేసే పత్రం సమర్పించాల్సి ఉంటుందని పటాన్‌చెరు రీజినల్ పీఎఫ్ కమీషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. అప్పుడే వారి పెన్షన్ ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగుతుందని తెలిపారు. ఈ జీవిత ధృవీకరణ పత్రాన్నే జీవన్ ప్రమాణ్ పత్ర అని కూడా పిలుస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు కేంద్రం ఫేస్ అథెంటికేషన్, టెక్నాలజీని తీసుకువచ్చిందని చెప్పారు. దీని ద్వారా తాము ఉన్న ప్రాంతం నుంచే లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించుకోవచ్చని రీజినల్ పీఎఫ్ కమీషనర్ తెలిపారు.

ఏసీబీ వలలో మున్సిపల్ ఆర్ఐ

మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న సోదాలు
రూ.12 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ

నవతెలంగాణ-మెదక్ టౌన్



మెదక్ మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మ్యుటేషన్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కిన సంఘటన మంగళవారం మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. మెదక్ మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా పని చేస్తున్న జానయ్య పట్టణానికి చెందిన ఓ బాధితుడి ఇంటి మ్యుటేషన్ కోసం రూ. 12 వేలు లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ పట్టణానికి చెందిన ధర్మగల్ల శివ కుమార్ తన అక్క శైలజ పేరు మీద ఉన్న ఇంటి స్థలాన్ని తన పేరు మీదకు మ్యుటేషన్ చేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్యను కోరాడు. దానికి మున్సిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. అందులో భాగంగా రూ.12 వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బాధితుడి నుంచి మున్సిపల్ ఆర్ఐ జానయ్య రూ.12 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిపారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏకకాలంలో జానయ్య స్వస్థలం నల్గొండ సూర్యాపేటలో ఉన్న అతని ఇంట్లో ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్యను అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈ సోదాలో సీఐలు వెంకటేశ్వర్లు, రమేష్‌తో పాటు సిబ్బంది తదితరులు ఉన్నారు.

కళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలి

-రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-అక్కన్నపేట



హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండల కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం స్కూల్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాం, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అందత్వ నివారణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శంకర కంటి ఆసుపత్రి వారు క్యాంప్ ఏర్పాటు చేసి 309 మంది పరీక్షలు నిర్వహించి, 129 మందికి ఆపరేషన్ చేస్తున్నారన్నారు. అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, గతంలో పెద్దవారికే కంటి అద్దాలు వచ్చేవి, ఇప్పుడు చిన్న పిల్లలకు కూడా వస్తున్నాయని తెలియజేశారు. ఆకు కూరలు బాగా తినాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి ఉచిత మందులు ఇస్తున్నారన్నారు. శంకర కంటి ఆసుపత్రి క్యాంప్ పెట్టడం వారిని అభినందనీయమని, మనం కళ్ళతో స్వేచ్ఛగా వీక్షించాలంటే, కళ్ళకు హాని కలగకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ శివయ్య, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ తిరుపతి రెడ్డి, డీఎంహెచ్‌వో పల్వాన్, ఆర్డీవో రామ్మూర్తి అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

శాంతి భద్రతలో భరోసా కల్పించాలి

-రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్ ప్రాంతంలోశాంతి భద్రతల విషయంలో సమస్య ఏర్పడినప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఐజీ రమేష్ రెడ్డి ఐపీఎస్, సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ, ఇతర అధికారులతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో ఏసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏసీపీ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీష్ ను చైర్‌లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలోనే ఏసీపీ కార్యాలయం ఫౌండేషన్ ఏర్పాటు చేసినప్పటికీ నిర్మాణానికి ఆలస్యం జరిగిందని, పెండింగ్ పనులు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు వస్తే అందరికీ న్యాయం జరిగేలా కార్యాలయం ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలో ఫ్రెండ్లీ పోలీస్ అంటే నేరస్తుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. బాధితులు వస్తే దగ్గరకు చేర్చుకొని న్యాయం చేయాలన్నారు. నేరం చేయాలంటే నేరస్తుడు భయపడేలా హుస్నాబాద్ పోలీసులు పని చేయాలి. ప్రజలు ఏ సమస్య వచ్చిన పోలీస్ స్టేషన్‌కి వచ్చి వారి సమస్యలు చెప్పుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాస్, ఆర్డీఓ రామ్మూర్తి , ఎస్సైలు తోట మహేష్, విజయ్ భాస్కర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చే మార్గం కనబడక వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



కూతురు వివాహం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనబడక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన ఈరమైన మల్లవ్వ-మల్లేశం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబం. సంవత్సరం క్రితం వీరి చిన్న కూతురు వివాహం చేశారు. ఆ వివాహం కోసం గ్రామస్తుల దగ్గర అప్పుచేశారు. కొద్ది రోజులు గడిచాక అప్పు తీర్చాలసిందిగా గ్రామస్థుల నుంచి ఒత్తిడి రావడంతో భార్య భర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. అదే విషయంలో సోమవారం రాత్రి ఇంట్లో నుంచి మల్లయ్య (50) వెళ్ళిపోయి వారి పొలం వద్ద గల చెట్టుకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త ఇంకా ఇంటికి తిరిగి రాలేదని చుట్టుపక్కల వెతకగా పొలం దగ్గర ఉరి వేసుకున్న దృశ్యం చూసారు. అప్పుల బాధ భరించలేక మల్లయ్య మృతి చెందాడని మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

మల్లన్న ఆలయ బుకింగ్ ఆదాయం రూ.58లక్షలు

-గత ఏడాది కంటే రూ.11 లక్షలు పెరిగిన ఆదాయం

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న జాతర ఎనిమిదో వారం మూడు రోజుల బుకింగ్ ఆదాయం రూ.58,39,513లు వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం వెల్లడించారు. శనివారం రూ. 4,61,054 ఆదివారం రూ 45,34,028, సోమవారం రూ.08,44,431లు వచ్చాయని తెలిపారు. భక్తులు స్వామివారి దర్శనాలు, లడ్డు ప్రసాదం, పట్నాలు, బోనాలు, టికెట్ల అమ్మకాల ద్వార ఈ ఆదాయం సమకూరినట్లు. గత ఏడాది 8 వ వారం రూ 46,87,250లు రాగ ఈసారిరూ.11,52,263లు అధిక ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

శివాలయానికి సిజిఆర్ విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో నూతనంగా నిర్వహిస్తున్న జీవనజ్యోతిర్లింగ శివాలయ నిర్మాణానికి గుమ్మడిదల సిజిఆర్ ట్రస్ట్ అధినేత రాష్ట్ర బీఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి రూ.1.50 లక్షల విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధి బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ ప్రతినిధులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోజిరెడ్డి ప్రతాపరెడ్డి రాజేందర్ రెడ్డి, మంద రమేష్ , గొర్ల శ్రీనివాస్ యాదవ్, రాజిరెడ్డి, రాము రాజు ఫణి గుప్తా, ప్రభాకర్ బుక్క శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ఎఫ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



- పర్మినెంట్ చేయాలని అడిగితే అక్రమ తొలగింపులా?
- రోడ్డున పడ్డ కుటుంబాలను ఆదుకునేలా అధికారులు చొరవ చూపాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- కలెక్టరేట్ ముందు సీపీఎం ధర్నా
- ఇన్చార్జి ఏవో దశరథకు వినతిపత్రం

నవతెలంగాణ-సంగారెడ్డి

ఎంఆర్ఎఫ్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పర్మినెంట్ చేయాలని అడిగితే తొలగిస్తారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. మంగళవారం సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి ఇంచార్జీ ఏవో దశరథ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ 4 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులను అకారణంగా విధుల నుంచి తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. యాజమాన్యం రిక్రూట్ చేసుకునే సందర్భంలో అయ్యేటప్పుడు మూడు సంవత్సరాల తర్వాత కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని తెలిపారని గుర్తు చేశారు. పర్మనెంట్ చేయాలన్న దాంతో కార్మికులందరినీ డ్యూటీలోకి రానీయడం లేదన్నారు. నాలుగు సంవత్సరాలు పూర్తయిన కార్మికులను పర్మనెంట్ చేయడం లేదన్నారు. 4 సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయి కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని, ఎంఆర్ఎఫ్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని తొలగించిన కార్మికులను వీధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.మానిక్, జి. సాయిలు, నర్సింలు జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, బాలరాజ్, ప్రవీణ్, దత్తు, సాయిలు తది తరులు పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతి కోసం గీతం-పైటెక్ వ్యూహాత్మక భాగస్వామ్యం

- అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసిన రెండు సంస్థల ప్రతినిధులు

నవతెలంగాణ-పటాన్‌చెరు





హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, బెంగళూరులోని పైటెక్ ఎంబెడెడ్ సిస్టమ్స్‌తో అధికారికంగా అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఇది విద్యా సహకారం, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలను పెంపొందించడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ ఒప్పందంపై మంగళవారం రెండు సంస్థల కీలక ప్రతినిధులు-గీతం ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, పైటెక్ డైరెక్టర్-సేల్స్ అరుణ్ కుమార్, మార్కెటింగ్ చీఫ్ మురగన్ రంగనాథన్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా 'ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఇండస్ట్రీ 4.0'పై దృష్టి సారించే రెండు రోజుల విద్యార్థుల కార్యశాలను కూడా వారు ప్రారంభించారు. అరుణ్ కుమార్ తన ప్రసంగంలో, విద్యారంగం, పరిశ్రమ మధ్య అంతరాన్ని తగ్గించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, ఈ భాగస్వామ్యం ద్వారా విద్యలో స్పష్టత, సాంకేతికత యొక్క ఆచరణాత్మక అనువర్తనాన్ని పెంచడానికి తాము చేతులు కలుపుతున్నట్టు చెప్పారు. వర్ధమాన ఇంజనీర్లను ప్రోత్సహించడం, వారి వ్యవస్థాపక ప్రయత్నాలలో మద్దతు ఇవ్వడం తమ లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం ఒక అవగాహన ఒప్పందమే కాదని, దీని ద్వారా విద్యార్థులను ఆవిష్కరణ, శ్రేష్ఠత వైపు నడిపిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి ఈ అవగాహనపై హర్షాన్ని వ్యక్తంచేస్తూ, ఇది కేవలం అధికారిక ఒప్పందం కంటే ఎక్కువగా ఉండేలా చూసుకోవడంతో పాటు, విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు-అన్ని స్థాయిలలో దీనిని అమలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ భాగస్వామ్యం ఈఈసీఈ విభాగంలోనే కాకుండా గీతంలోని అన్ని విభాగాలలో పరిశోధన సంస్కృతిని మారుస్తుందని అభిలషించారు. బీ.టెక్. విద్యార్థులకు ప్రాజెక్టులు, ఎం.టెక్. విద్యార్థులకు పరిశోధనా పనిలో మద్దతు ఇవ్వడానికి పైటెక్ సిద్ధంగా ఉందని ప్రొఫెసర్ శాస్త్రి వెల్లడించారు. ఇది విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే, సైద్ధాంతిక జ్ఞానాన్ని ఆచరణాత్మక అనువర్తనంతో అనుసంధా నించే ప్రత్యక్ష పనిచేసే అవగాహనా ఒప్పందంగా ప్రొఫెసర్ డీ.ఎస్.రావు అభివర్ణించారు. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలని, పరిశ్రమ పురోగతికి తగ్గట్టుగా ఎదగాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. తొలుత, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి స్వాగత వచనాలతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ అవగాహన మేరకు, పైటెక్ గీతంలో ఒక సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ఏర్పాటు చేస్తుందని, ఇది శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, ఎంబెడెడ్ సిస్టమ్‌లలో పరిశోధనకు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు ప్రొఫెసర్ పి.త్రినాథరావు వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ భాగస్వామ్యం గీతంలో విద్యా అనుభవాన్ని మెరుగుపరచడం, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు తగ్గట్టు అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

నల్లవల్లి, ప్యారా నగర్ డంపు యార్డును వెంటనే రద్దు చేయాలి

- కాలుష్యం లేదని ఎలా అనుమతి ఇచ్చారు
- ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమా
- జవహర్ నగర్ డంప్ యార్డ్ దగ్గర వారం రోజులు ఉండగలరా
- పీసీబీ కార్యాలయం ముందు ధర్నా
- డంప్ యార్డ్ రద్దుకు సిఫారసులు వెంటనే చేయాలి
- ప్రజా సంఘాల పోరాట వేదిక కన్వీనర్ కే రాజయ్య



నవతెలంగాణ-రామచంద్రాపురం



నల్లవల్లి, ప్యారా నగర్ డంపు యార్డును వెంటనే రద్దు చేయాలని కోరుతూ రామచంద్రాపురంలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జోనల్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ కే రాజయ్య మాట్లాడుతూ నల్లవల్లి, ప్యారా నగర్ ప్రాంతంలో కాలుష్యం లేదని ఎలా అనుమతిచ్చారని పిసిబి అధికారులను సూటిగా ప్రశ్నించారు. కాలుష్యం లేదని బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు లేకుంటే గ్రామాలలో గ్రామసభలు పెట్టి రుజువు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో సభలు పెట్టే ధైర్యం మీకు ఉందా...అంటూ వెంటనే గ్రామ సభలు పెట్టాలని అన్నారు. వాయు కాలుష్యము జల కాలుష్యం అవుతుందని అందరు చెప్పుతుంటే పిసిబి వాళ్ళు అలా ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఎలా అనుమతులు ఇచ్చారని, అనుమతులు వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు, రద్దు చేయకపోతే భవిష్యత్తులో మీ కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. ప్రజా అభిప్రాయ సేకరణ పెట్టకుండా ఎలా కాలుష్యం లేదని అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. నెల రోజుల నుంచి ఆందోళన జరుగుతుంటే పిసిబి అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు. ప్రజల పోరాటాలు కంటికి కనిపించడం లేదా అని అన్నారు. ప్రజలకు ఉపయోగపడని పిసిబి కార్యాలయం ఎందుకు ఉందని అన్నారు. 15 కిలోమీటర్ల వరకు వాయు కాలుష్యము, జల కాలుష్యం అవుతుందని జవహర్ నగర్ డంపు యార్డ్ అనుభవం తెలియజేస్తుంది కదా ఆ అనుభవం దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. తక్షణమే పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా రద్దుకు సిఫారసు చేయాలని ఆయన హెచ్చరించారు. లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం పిసిబి అధికారులకు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, రామ్ రెడ్డి, రాములు, వెంకటేశ్వరరావు, సురేష్ , రమణయ్య వీరస్వామి, జయరాము, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నెలలో పూలే, అంబేద్కర్ జన జాతరలు

అంబేద్కర్ పూలే స్ఫూర్తితో కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు
కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-జోగిపేట

ఏప్రిల్ నెలలో పూలే, అంబేద్కర్ జన జాతరలు, అంబేద్కర్ పూలే స్ఫూర్తితో కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలు నిర్వహిస్తున్నట్లు కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ తెలిపారు. మంగళవారం జోగిపేట పట్టణంలో జరిగిన సామాజిక సంఘాల నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటికీ గ్రామాల్లో కులవివక్ష అంటరానితనం ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కొనసాగుతుందన్నారు. దీనిని సహించబోమని ఏప్రిల్ నెల ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. నేటికి దళితులకు గుడి ప్రవేశం లేని గ్రామాలు, బతుకమ్మ ఆడనీయని గ్రామాలు, క్షవరం చేయకపోవడం, దసరా పండుగ సందర్భంగా జమ్మి ఆకు తెంపారని దాడి, హెూటళ్ళలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతుందన్నారు. అదేవిధ:గా, పాఠశాలల్లో దళితులు మధ్యాహ్న భోజనం వంట చేస్తే విద్యార్థులు తినకపోవడం రచ్చబండ మీద కూర్చోనియ్యకపోవడం వంటి కులవివక్ష రూపాలు కొనసాగున్నాయని చెప్పారు. పట్టణాల్లో దళితులకు ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదన్నారు. ఇంకా అనేక రూపాల్లో కుల వివక్ష అంటరానితనం కొనసాగుతుందన్నారు. వీటన్నిటిని పారద్రోలటానికి ఉన్న చట్టాలు జీవోలు రాజ్యాంగ బద్ధమైన హక్కులను పాలకవర్గాలు అమలు చేయడం లేదన్నారు. ఈ వివక్ష రూపాలపై ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఏప్రిల్ నెల మహనీయుల మాసంగా కేవీపీఎస్ ప్రకటించి పూలే అంబేద్కర్ జన జాతరలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు కుల వివక్ష అంటరానితనం ఎక్కడ కొనసాగితే అక్కడ ప్రత్యక్ష ప్రతిఘటన పోరాటం నిర్మించాలన్నారు. కులవివక్ష అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించేందుకు కేవీపీఎస్ సన్నద్ధం అవుతుందన్నారు. ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. నాడు కేవీపీఎస్ ప్రణయ్ కుటుంబానికి అండగా ఉంటే మతోన్మాద శక్తులు మారుతిరావుకు మద్దతుగా నల్గొండలో ప్రదర్శన నిర్వహించారన్నారు. కుల ఉన్మాదులకు కోర్టు ఇచ్చిన తీర్పు కనువిప్పు అన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ మాజీ జిల్లా కార్యదర్శి డి. విద్యాసాగర్, సామాజిక సంఘాల నాయకులు అందోల్ మల్లేశం, దుర్గయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాయ మాటలు చెప్పి మహిళల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- మహిళలకు మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే వి.సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత
- కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మహిళలకు రూ. 10 లక్షలు, పావలా వడ్డీ రుణం ఇస్తామని చెప్పి మాట తప్పారని మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే వి.సునీతా లక్ష్మారెడ్డి విమర్శించారు. మంగళవారం పటాన్ చెరు పట్టణంలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, తెలంగాణ రాష్ట్ర మాజీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సుమిత్ర ఆనంద్, సంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ భూపాల్ రెడ్డి సతీమణి గీత భూపాల్ రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుందన్నారు. ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఫించన్ ఇవ్వలేదని, ఎలాంటి హామీ నేరవేర్చలేదని దుయ్యబట్టారు. చదువుకునే విద్యార్థినీలకు స్కూటీలు ఇస్తామని ఇప్పటి వరకు ఒక్క స్కూటీ కూడా ఇవ్వలేదన్నారు. పెండ్లి చేసుకున్న పేద మహిళలకు తులం బంగారం ఇస్తామని చెప్పి ఏ ఒక్కరికి ఇవ్వలేదన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులం చేస్తామని తూతూ మంత్రంగా చెక్కులు పంపిణీ చేశారని విమర్శించారు. గతంలో మహిళలకు రేవంత్ రెడ్డి ఇచ్చిన చెక్కులు మూడు నెలలకే బౌన్స్ అయ్యాయన్నారు. అవే చెక్కులను మొన్న మహిళా దినోత్సవం రోజున అందజేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదని ధ్వజమెత్తారు. కనీసం ఆ చెక్కు అయినా ఇప్పుడు పాస్ అవుతదా లేదానని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో కొనసాగాలని వారు పిలుపునిచ్చారు. ఇంత పెద్ద ఎత్తున అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించిన స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ... అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొన వలసిందిగాని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సమావేశం ఉన్నందున హాజరు కాలేదని తెలిపారు. ముఖ్య అతిథులుగా హాజరైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గాను ఎంతో ఆనందంగా ఉందన్నారు. మహిళలందరూ స్వయం ఉపాధితో ఎదగాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీధర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

బంజేరుపల్లి కెనాల్‌లోకి నీళ్లను విడుదల చేయండి

- నిరసన తెలిపిన రైతులు

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్




నీళ్ల లేక పొట్టదశకు వచ్చిన వరి పంటలు ఎండిపోతున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోవడంలేదని నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు వాపోయారు. మంగళవారం బంజేరుపల్లి, కోదండరావుపల్లి గ్రామాల మధ్యలో ఉన్న 9 నెంబర్ కెనాల్ వద్ద వారు సాగు నీరు విడుదల చేయాలని కోరుతూ కాలువలో నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం రంగనాయక సాగర్ నుంచి పంటల కోసం కాలువల ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ, తమకు మాత్రం కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే వదిలి ఊరుకున్నారని, ఇప్పుడు తమ వరిపంటలు పొట్ట దశకు వచ్చిన నేపథ్యంలో నీళ్ల లేక అవి ఎండి పోతున్నాయన్నారు. నీళ్ల ఎన్నోమార్లు అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకోవడంలేదని, రెండు మూడు రోజుల్లోగా సమస్య పరిష్కారం కాకపోతే, తాము రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బంజరుపల్లి గ్రామాలకు చెందిన రైతులు యాదవ చందు, కొండల్ రెడ్డి, రవీందర్, నరసింహారెడ్డి, శ్రీకాంత్, దుర్గ రాజయ్య ఎండీ. సర్వర్, మల్లయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మీసేవ జిల్లాల మేనేజర్ల బదిలీలు తొలగింపులపై సమగ్ర విచారణ జరపాలి

మీ సేవ మేనేజర్ల అక్రమ బదిలీలను వెంటనే ఆపాలి
కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్

నవతెలంగాణ-సంగారెడ్డి



మీ సేవ కేంద్రాలను పర్యవేక్షణ చేస్తున్న ఈడిఎం (ఈ డిస్టిక్ మేనేజర్స్), డిఎం (డిస్టిక్ మేనేజర్స్) ఇష్టానుసారంగా బదిలీలు, తొలగింపులు చేయడం దారుణమని, బదిలీలను వెంటనే ఆపాలని తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజలకు పౌర సేవలు అందించేందుకు మీసేవ కేంద్రాలు పనిచేస్తు న్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 4758 మీసేవ ఫ్రాంచైజ్ కేంద్రాలు 33 జిల్లాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సేవలతో పాటు ఇతర పౌర సేవలు అందిస్తున్నాయన్నారు. మీసేవ కేంద్రాలు నిర్వహణ వాటిలో, తలెత్తే సమస్యల పర్యవేక్షణ కోసం ఈడీఎం డిఎంలను అవుట్సోర్సింగ్ పద్ధతుల్లో జిల్లా కు ఒకరి చొప్పున ప్రభుత్వం నియమించిందన్నారు. అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టారాజ్యంగా 12 జిల్లాల మేనేజర్లను నిర్దాక్షణంగా తొలగిం చడంతో వీరి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రోస్టర్ పద్ధతి అనేది లేకుండా ఇష్టం వచ్చినట్లు బదిలీ చేయడం, తొలగించడం దుర్మార్గ చర్య అని అన్నారు. బదిలీలు తొలగింపుల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడిన వాళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీలను వెంటనే ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మానిక్ డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
సంగారెడ్డి
బుధవారం | 12 మార్చి 2025 | www.navatelangana.com

సీఐఎస్ఎఫ్ పనితీరు భేష్




● ఘనంగా సీఐఎస్ఎఫ్ 56వ వ్యవస్థాపక దినోత్సవం

నవతెలంగాణ-రామచంద్రాపురం

సిఐఎస్ఎఫ్ 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని రామచంద్రాపురంలోని భేల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) వ్యవస్థాపక దినోత్సవానికి సిఐఎస్ఎఫ్ కమాండెంట్ మంజీత్ కుమార్‌తో పాటు భేల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బి రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేబి. రాజా మాట్లాడుతూ ప్రభుత్వ భవనాలు, విమానాశ్రయం, తాజ్‌మహల్, ఓడరేవులు, పీఎస్యూలు వంటి పరిశ్రమలు, జాతీయ ఖ్యాతి గడించిన ప్రైవేట్ పరిశ్రమలకు భద్రత కల్పించడానికి సిఐఎస్ఎఫ్ భారతదేశం అత్యంత ప్రధాన భద్రతా దళంగా మారిందన్నారు. 1988 నుంచి భేల్ సంస్థ భద్రతా అవసరాల కోసం సిఐఎస్ఎఫ్‌ను నియమించిందని తెలిపారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది రైజింగ్ డే కవాతును నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా దళాలు చేపట్టిన సాహసోపేత విన్యాసాలు అందర్నీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భేల్ అధికారులు, సిఐఎస్ఎఫ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రేజింతల్ పాఠశాలకు సేవా దృక్పథం



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ ప్రభుత్వ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యం కొరకు అక్కడే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణ సేవా దృక్పథంతో పాఠశాలకు రూ.1000ల విలువైన కార్పెట్ అందజేశారు. పాఠశాల కోసం సహాయం చేయడం పట్ల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు అభినందించారు . పాఠశాల హెచ్ఎం గురునాథ్ మాట్లాడుతూ గ్రామస్తులు యువజన సంఘాలు స్వచ్ఛంద సంస్థలు పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు రావాలని పేర్కొన్నారు. అందరి సమన్వయంతో పాఠశాల మరింత మెరుగుపరచుకుందామని అన్నారు . . ఈ కార్యక్రమంలో హెచ్ఎం గురునాథ్, ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి , జైసింగ్, సంగమేశ్వర్, తదితరులున్నారు.

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● ఎంఈఓ అంజయ్య



నవతెలంగాణ-రాయికోడ్

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం అందించాలని స్థానిక ఎంఈఓ అంజయ్య అన్నారు.మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్ లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసి, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఉపాధ్యాయుల చేత విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిసున్నారని వారికి నాణ్యమైన విద్యను అందించి, ఉన్నత శిఖరాలకు చేరవేయాలన్నారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇన్చార్జి ప్రిన్సిపల్ మంజుల వాని, శ్రీనివాస్, సంధ్య, శివశంకర్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎమ్ అండ్ హెచ్ఓ లలిత కుమారి స్థానిక మహిళా డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునంద, ఎఫ్ పి ఎ ప్రతినిధి ప్రశాంత్ ఏఎన్ఎం రాజకుమారి ఆశా వర్కర్లు నాగమణి బృందం పాల్గొన్నారు.

సాగు పద్ధతిలో మెలకువలు పాటించాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

వేసవి పంటలు రైతులు సాగు పద్ధతిలో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ ఏవో అవినాష్ వర్మ పేర్కొన్నారు. ముంగి రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. రైతులు పాటించాల్సిన వ్యవసాయ యజమాన్య పద్ధతులపై అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవో సనిత్ రెడ్డి, నాగేష్ , రైతులు ఉన్నారు .

తైబజార్ వేలం పాటకు దరఖాస్తులు

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో 2025-2026 సంవత్సరానికిగాను తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జే జగ్జీవన్ తెలిపారు. మార్చి 12వ తేది నుంచి మార్చి 16వ తేది వరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. మార్చి 17వయ తేదిన మధ్యాహ్నం 2:30 గంటలకు వేలంపాట ఉంటుందని ఆయన తెలిపారు.

గంగారాం తండా పాఠశాలలో స్వయం పరిపాలన

నవతెలంగాణ-మనూర్

నాగల్గిద్దా మండలం కారస్ గుత్తి గంగారాం తండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించాను. ఒక రోజు పాఠాలు భోదించి సంతోషం వ్యకం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన ఎస్పీ పరితోష్ పంకజ్‌ను కలిసిన అఖిల్



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా నూతన ఎస్పీ పరితోష్ పంకజ్‌ను హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అఖిల్ పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేశారు. హెల్పింగ్ హాండ్స్ సేవలను ఎస్పీకి వివరించారు.


ఎమ్మెల్సీ అంజి రెడ్డికి ఘన స్వాగతం



నవతెలంగాణ-జహీరాబాద్

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలుపొందిన అనంతరం మొదటిసారి జహీరాబాద్‌కి వచ్చిన అంజిరెడ్డి దంపతులకు జహీరాబాద్ బీజేపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. జాతీయ రహదారి గుండా వాహనాలపై ర్యాలీ నిర్వహించకుండా శివాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పూల సంతోష్ భాస్కర్ యాదవ్ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



నవతెలంగాణ-మనూర్

నాగల్గిద్దా మండలంలోని ఇరకపల్లి గ్రామానికి చెందిన పండరి నాథ్ రావ్ వర్ధంతి మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పి సుధాకర్ రెడ్డిలు పాల్గొన్నారు. చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో అంజిరెడ్డి కుటుంబ సభ్యులు విట్టల్ రావ్, రాజు పటేల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రధారణ కార్యక్రమంలో పాల్గొన్న సాగర్ శెట్కార్



నవతెలంగాణ-మనూర్

మండలంలోని రాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాంచేందర్ మనుమడు, మనుమరాలు నూతన వస్త్రధారణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కాంగ్రెస్ యువ నేత సాగర్ శెట్కార్ పాల్గొన్నారు. చిన్నారులకు ఆశీర్వదిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివేకానంద గ్రామస్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ దహనం, ప్రజల ఆరోగ్యానికి పరేషాన్

● గత మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి
● మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోని వైనం
● గాలి, నీరు కాలుష్యమవుతున్నాయని ప్రజల ఆవేదన

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట మండల పరిధిలోగల ఎన్కేపల్లి గ్రామ శివారులో దాదాపు 5 ఎకరాల డంపింగ్ యార్డ్ ఉన్నది. గత మూడు రోజుల నుంచి డంపింగ్ యార్డ్ కాలిపోవడం వల్ల దట్టమైన పొగలు కమ్ముకోవడం వల్ల గ్రామానికి వెళ్లే దారి, అదేవిధంగా జాతీయ రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తీవ్రంగా వాయు కాలుష్యం వెదజల్లడం మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు, యువకులు తీవ్రంగా అసహనానికి గురవుతున్నారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ సదాశివపేట మున్సిపల్ అధికారుల లోపం వల్లే ఎన్కేపల్లి గ్రామం దుర్వాసన వెదజల్లుతూ, గాలి, నీరు కాలుష్యానికి గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా దట్టమైన పొగలు వస్తున్నందున నిత్యం సదాశివపేట పట్టణానికి, గ్రామానికి వెళ్లేవారికి ఏమి కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ దుర్వాసన వల్ల గత సంవత్సరం నుంచి గ్రామంలోని వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని, గ్రామంలోని చెరువులోకి కూడా దుర్గంధమైన నీరు వెళ్లడం వల్ల పశువులు నీరు త్రాగలేక పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ఇదేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ సిబ్బందిపై, మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డంపింగ్ యార్డ్ వద్ద వారు నిరసన తెలిపారు.




ప్రమాదవశాత్తు డంప్ యార్డు దగ్ధం
-సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్

సానిటరీ అధికారి అశోక్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ పక్క గల పొలంలో వరి చేను కొయ్యలకు నిప్పు పెట్టడంతో నిప్పు కనికలు డంపింగ్ యార్డ్‌లో ప్రమాదవశాత్తు రావడం వల్ల నిప్పు అంటుకుందని గత మూడు రోజుల నుంచి అగ్నిమాపక సిబ్బంది కూడా సాయ శక్తుల ప్రయత్నం చేస్తున్నా మంటలు అదుపులోకి రావడం లేదు. దట్టమైన పొగలు వచ్చాయి. దీనిని పూర్తిస్థాయిలో అదుపులోకి తీసుకొస్తామని తెలిపారు.

కలెక్టర్ నేతృత్వంలో ఎంఆర్ఎఫ్ యాజమాన్యం, ట్రైనీ కార్మికుల మధ్య చర్చలు

● ట్రైనీ కార్మికులకు కాంట్రాక్టు కార్మికులుగా తీసుకోవడానికి అంగీకరించిన యాజమాన్యం
● గ్రాట్యూటీ చట్టం ప్రకారం గ్రాట్యూటీ డబ్బులు చెల్లించాలి
● జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలోని సదాశివపేటలో గల ఎంఆర్ఎఫ్ కంపెనీ యాజమాన్యం, ట్రైనీ కార్మికుల మధ్య తలెత్తిన వివాదం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జోక్యంతో జరిగిన చర్చల్లో ఒక కొలిక్కి వచ్చింది. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తన కార్యాలయంలో ఎంఆర్ఎఫ్ ట్రైనీ కార్మికులు, కంపెనీ యజమాన్యంతో సోమవారం సాయంత్రం చర్చలు జరిపారు. ట్రైనీ కార్మికులు తమ ఇష్టపూర్వకంగా కంపెనీలో



పనిచేయదలుచుకుంటే వారిని కాంట్రాక్ట్ కార్మికులుగా తీసుకోవడానికి కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. సమాన పనికి సమాన వేతనం చట్టం ప్రకారం తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వారి పనితీరు అర్హతలను బట్టి వారికి రూ. 18 వేల నుంచి 24 వేల వరకు వేతనం ఇవ్వడానికి కంపెనీ యజమాన్యం అంగీకరించింది. కాంట్రాక్టు కార్మికులుగా 10 సంవత్సరాలకు పైగా పనిచేసిన ట్రైనీ కార్మికులకు గతంలో యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు గ్రాట్యూటీ చట్టం ప్రకారం గ్రాట్యూటీ డబ్బులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కార్మిక కమీషనర్ రవీందర్ రెడ్డి, కార్మిక సంఘం ప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం



● ప్రతి కార్యకర్తకు అండగా నిలబడదాం..
● మినిస్టర్ క్వార్టర్స్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం
● హాజరైన నీలం మధు ముదిరాజ్, కాటా

నవతెలంగాణ-పటాన్ చెరు

కార్యకర్తలే పార్టీకి బలం అని ప్రతి నాయకుడు కార్యకర్తలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. మంగళవారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జిలు,సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు ఇరువురు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం విరివిగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రతి వాడలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను సేకరించి తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ పూర్తవగానే ఎస్డిఎఫ్ నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధి కార్యక్రమాల పనులను కార్యకర్తలకే కేటాయించేలా ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇన్చార్జిలు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని ప్రతి నాయకుడు కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో తోడుండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు అవకాశాలు కల్పించి వారిని నాయకులుగా తయారు చేయాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో కి తీసుకెళ్తే ప్రజల మద్దతు లభించి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

● మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ
● ఎమ్మార్పీఎస్ నిరసన రిలే దీక్షలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మహజన సోషలిస్ట్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వద్ద రిలే నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు అబ్రహం మాదిగ ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి మాదిగల ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉండాలన్నారు. అసెంబ్లీ సాక్షిగ ఉద్యోగ నియామక ఫలితాలు నియమకాలు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత పూర్తయ్యేంతవరకు ఉద్యోగ నియమకాలు చేపట్టమని హామీ ఇవ్వడం జరిగింది, ఇప్పుడు గ్రూప్ వన్ ఫలితాలు విడుదల చేయడం మాదిగలను దగా చేయడం, మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా ఉద్యోగ ఫలితాలు నియమకాలు అపాలని గ్రూప్ టూ గ్రూప్ త్రీ ఫలితాలు కూడా నిలిపేయాలని, లేనిపక్షంలో పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మరో



యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద గీత మాదిగ, ఎంఎంఎస్ రాష్ట్ర నాయకురాలు, రామ్ చందర్ మాదిగ ఎం.ఇ ఎఫ్ జిల్లా అధ్యక్షులు, గంధ గల వీరయ్య మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా గౌరవ అధ్యక్షులు, దేవరంపల్లి అశోక్ మాదిగ, జర్నలిస్ట్ ఫోరం ఉమ్మడి జిల్లా ఇంచార్జ్, ముత్తర గల రాజు మాదిగ, ఎమ్మెస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి, కాశిపురం ఆంజనేయులు, మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు,మల్యాల నరసింహులు మాదిగ ఎమ్మార్పీ ఎస్ జిల్లా నాయకులు ,పొట్పోళ్ల వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థులతో టీజీఐఐసీ చైర్మెన్ ముఖాముఖి

నవతెలంగాణ-సదాశివపేట



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్స్ సోషల్ మీడియా, వంటి సాంకేతిక పరిజ్ఞానం తెలిసి, సామాజిక స్పృహ కలిగిన తెలివైన యువతతో జనరేషన్ జెడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జనరేషన్ జెడ్ వారు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్‌ను వివిధ ప్రశ్నలు అడగ్గా సమాధానాలు ఇచ్చారు. బాల్యం నుంచి రాజకీయ జీవితం, వారి వైవాహిక జీవితం, మొదలగు ప్రశ్నలు అడగ్గా, ఓపికగా విద్యార్థులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బంగ్లా భారతి మాట్లాడుతూ ఇంగ్లీషు తెలుగు సబ్జెక్టులలో ఇంటర్వ్యూ స్కిల్స్ ఎట్లా పెంపొందించుకోవానే దానిపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహించారు. ఇంటర్వ్యూలో ప్రశ్నలు ఎట్లా అడగాలి అనే స్కిల్‌పై వివిధ రకాలుగా శిక్షణను ఇచ్చారు. అందులో భాగంగా



మంగళవారం చివరగా నిర్మల జగ్గారెడ్డిని తమ ఇంటర్వ్యూ స్కిల్ ద్వారా అనేక ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమం విజయవంతమైనందుకు సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, సదాశివపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ కంది కృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు గుండు రవి, పిల్లోడి విశ్వనాథం, సుభాష్, నాగరాజు గౌడ్, కళాశాల సిబ్బంది వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిద్దులు, మురళీకృష్ణ, శకుంతల, సర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా శారమ్మ

నవతెలంగాణ-సంగారెడ్డి



కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మహిళా విభాగం సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ మద్దూరి.శారమ్మ, కో కన్వీనర్ గా ఏ. పద్మ , కమిటీ సభ్యులుగా గంగమణి, ఎన్. సంధ్యారాణి, టి.దివ్య, హారిక, బి.వినోద లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మద్దూరి.శారమ్మ, కో కన్వీనర్‌గా ఏ.పద్మ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపైన కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. తనపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అతిమల మాణిక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమలు దాతృత్వాన్ని చాటాలి



నవతెలంగాణ-జిన్నారం

పరిశ్రమలు సామాజిక సేవ పూరిత అభివృద్ధి కార్యక్రమాల్లో దాతృత్వాన్ని విస్తరించాలని జిన్నారం మండల పరిషత్ మాజీ అధ్యక్షులు దమ్మగౌని రవీందర్ గౌడ్ అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా మంగళవారం నాలుగు తరగతి గదుల నిర్మాణానికి సంబంధించిన పనులను న్యూ ల్యాండ్ పరిశ్రమ ప్రతినిధి శారదా బృందంతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సమాజ ఉపయోగకరమైన పనులు విద్య వైద్య రంగానికి సంబంధించిన అంశాల్లో పరిశ్రమలు విరివిగా దాతృత్వ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సుమారు రూ.55 లక్షల వ్యయంతో నూతనంగా పాఠశాల గదుల నిర్మాణానికి ముందుకు వచ్చిన న్యూ లాండ్ పరిశ్రమ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు.

విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం

స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటు చేయడం కూడా ప్రశంస నీయమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ బృందాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ ప్రతినిధులు శారద రవికుమార్, హెచ్ఎం మృదుల జిన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, కాంగ్రెస్ యువ కిశోరం నరేందర్ గౌడ్, శివనగర్ బత్తుల మహేష్, పల్నాటి భాస్కర్ శంకరయ్య వీర్నాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా విశిష్ట స్కూల్‌లో ఇంగ్లీష్ ఫెస్ట్



నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలోని విశిష్ట స్కూల్‌లో ఇంగ్లీష్ ఫెస్ట్ ఘనంగా నిర్వహించారు. మంగళవారం వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొని రోల్ ప్లే, స్కిట్, కన్వర్షన్, డ్రామా, వివిధ రకాల యాక్టివిటీస్ అన్ని ఇంగ్లీష్‌లోనే నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట స్కూల్ కరస్పాండెంట్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులు వారి కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు

నవతెలంగాణ-జహీరాబాద్



పన్నులు చెల్లించే మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శుక్లవర్ధన్ రెడ్డి రూపాయలు 65 వేల పన్నులు చెల్లించినట్లు తెలిపారు. పన్నుల వసూలుకు మున్సిపల్ సిబ్బంది అందరూ కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టణపుర ప్రముఖులు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ దీప్చంద్, ఆర్వో బిల్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామచంద్రాపురం:

రామచంద్రాపురం డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ కూతురు ఐశ్వర్య వివాహానికి శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మెన్ బలరాం మంగళవారం తన వంతు సాయం అందజేశారు. ఒక బస్తా బియ్యం, రూ.10,116/- ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాస్ ఇంటికి బలరాం తన మిత్ర బృందంతో వెళ్లి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రామచంద్రాపురం ప్రాంతంలో నిరుపేద కుటుంబాలకు చేయూతనిచ్చే కార్యక్రమాలను శ్రీ బాలాజీ ఫౌండేషన్ ముందుండి చేస్తున్నదని తెలిపారు. ఇప్పటికే వివిధ రకాల సహాయ సహకారాలను తాము అందించామన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, గోపాల్ రెడ్డి, సంతోష్, వెంకటరామిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



● మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం పలు వార్డులలో ఆయన పర్యటించారు. 4వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పై సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. తదనంతరం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ లో భాగంగా గండిగూడెం రోడ్డులో వున్న చెత్త, పిచ్చి మొక్కలు, ఇరువైపులా మట్టి కుప్పలు తీస్తున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిష్టయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నీల కంటి సత్యంను కలిసిన ఖాలేక్



నవతెలంగాణ-నర్సాపూర్

ఎమ్మెల్యేల కోటాలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల తరపున ఉమ్మడి అభ్యర్థిగా బలపరిచిన నీల కంటి సత్యం మెదక్ జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి ఖాలేక్ మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేషన్ వేసిన సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నీల కంటి సత్యంను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఖాలేక్ మాట్లాడుతూ నల్గొండ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న సత్యంకు సిపిఐ, కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. సత్యం నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని అటువంటి వ్యక్తికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలను సిపిఐ పార్టీ ఎప్పుడు మరవదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజా గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఇసాక్ అహ్మద్, మహిళా సమైక్య విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

జగ్గంపేట పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని జగ్గంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓగా మధుసూదన్, డిఇఓ గౌతమ్, హెచ్ఎం శశికాంత్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా కవిత, రక్షిత, అశ్విని, వర్షిత, ధనశ్రీ, శరత్, బాధ్యతలు చేపట్టి పాఠశాలను నడిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్ మాట్లాడుతూ సంవత్సరానికి ఒకసారి నిర్వహించే ఈ దినోత్సవం విద్యార్థులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జగంపేట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్, ఉపాధ్యాయురాలు మౌనిక పాల్గొన్నారు.

బోనమెత్తిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట మండలం ముద్దాపూర్ గ్రామంలో ముత్యాల పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారి బోనాల కార్యక్రమంలో మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. మహిళలతో కలసి భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముద్దాపూర్ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పోచమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు, కురుమూర్తి గౌడ్, దానయ్య, లింగారెడ్డి, బద్రి.మల్లేశం శ్రీనాథ్ రావు, ఎంపీటీసీల ఫోరమ్ మాజీ అధ్యక్షులు. వడ్ల కుబేర్, నాయకులు సాయి రెడ్డి, సొంగ దుర్గయ్య, ఏడుపాయల దేవస్థానం మాజీ ధర్మకర్తలు నాగప్ప, దుర్గయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారికి మహాపూజలు



నవతెలంగాణ-శివ్వంపేట

దేశంలోనే మొట్టమొదటిగా, తెలుగు రాష్ట్రాలలో ప్రప్రథమంగా నిర్మితమైన, అత్యంత శక్తిపీఠాలలో ఒకటైన మెదక్ జిల్లా శివ్వంపేట శ్రీబగలాముఖీ అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు మహాపూజలు నిర్వహించారు. అమ్మవారి ఉపాసకులు, బ్రహ్మర్షి శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో శక్తిపీఠం ప్రధాన అర్చకులు కమలేష్ పండిత్ అమ్మవారిని పీతవర్ణ పుష్పాలు, పీతవర్ణ వస్త్రాలతో విశేషంగా అలంకరించి, అమ్మవారికి మహాపూజలతో పాటు రుద్రయామల బగలా అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి ప్రీతిపాత్రమైన పసుపుతో అర్చన (హరిద్రార్చన) నిర్వహించడమే కాకుండా అభిషేకం, మంగళహారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల ఫలాలతో నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శనం చేసుకునేందుకు హాజరైన భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ట్రస్ట్ సభ్యులు శాస్త్రుల పురుషోత్తం శర్మ,కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు కొడకంచి రవీందర్ గౌడ్, పత్రాల త్రినేష్ గౌడ్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్,రాజీపేట కిషన్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-మనోహరాబాద్

డ్యూటికని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులకు భార్య ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం మండలంలోని పోతారం గ్రామానికి చెందిన కత్తి ప్రభు (30) మండల కేంద్రంలోని సూపర్ సీడ్ పరిశ్రమలో ఉద్యోగం చేసేవాడని తెలిపారు. కాగా ఈ నెల 8న రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బైక్‌పై వెళ్లినట్టు తెలిపారు. అలా వెళ్లిన తన భర్త ఇంత వరకు ఇంటికి తిరిగి రాలేదని తెలిపారు. అతని ఆచూకి కోసం చుట్టు ప్రక్కన గల గ్రామాలతో పాటు బంధువుల వద్ద ఆరా తీసినప్పటికి ఆచూకి లభించలేదని తెలిపారు. కాగా తన భర్త పని చేస్తున్న సూపర్ సీడ్ పరిశ్రమకు సరిగ్గా డ్యూటికి వెళ్లేవాడు కాదని తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లిన తన భర్త ఇప్పటి వరకు రాలేదని విచారణ చేసి న్యాయం చేయాలంటూ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇంట్లో నుంచి వెళ్లేటప్పుడు పసుపు రంగు షర్ట్, తెలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్టు తెలిపారు. ఈ మేరకు మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని వ్యక్తి మృతి



నవతెలంగాణ-నార్సింగి

కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన వట్టేపు స్వామి (32)కి మూడు సంవత్సరాల క్రితం చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన ధ్యానబోయిన శిరీషతో వివాహం జరిగింది. వారికి ఇప్పటికీ పిల్లలు కలగలేరు. ఆ విషయమై ఇరువురి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్న క్రమంలో శిరీష భర్తతో గొడవపడి గత తొమ్మిది నెలల క్రితం తల్లి గారింటికి వెళ్ళిపోయింది. కొద్ది రోజుల క్రితం పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించిన మృతుని తండ్రి వట్టేపు ఆగమయ్య కోడలు శిరీషను ఒప్పించి సంసారానికి తీసుకుని వచ్చాడు. గత ఇరవై రోజుల క్రితం శిరీష అన్న చనిపోగా అంత్యక్రియలకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపంతో ఉన్న స్వామి మంగళవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో వల్లూరు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు స్వామి తన తమ్ముడు వట్టేపు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి తాను వల్లూరు అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. శ్రీకాంత్ వెంటనే తండ్రితో పాటు వల్లూరు అటవీ ప్రాంతానికి వెళ్లేసరికి చెట్టుకు ఉరి వేసుకుని కొన ఊపిరితో కనిపించాడు. వెంటనే నార్సింగిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని అక్కడి వైద్యులు నిర్ధారించగా పోలీసులు మృత దేహానికి పోస్ట్ మార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆసుపత్రి తరలించారు. మృతుని తండ్రి ఆగమయ్య తన కొడుకు మృతిపై ఎలాంటి సందేహాలు లేవని, తదుపరి కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-వెల్దుర్తి : కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన చేపూరి ప్రశాంత్ (22) గత నాలుగేళ్ల క్రితం శివంపేట మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుకన్యతో వివాహం జరిగిందన్నారు. వీరికి రెండు సంవత్సరాల కూతురు ఉన్నట్లు తెలిపారు. గత కొన్నాళ్ల నుంచి భార్య భర్తల మధ్య చిన్నపాటి గొడవలతో భార్య సుకన్య పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రశాంత్ అంతలోనే మనస్థాపానికి గురై చెట్ల తిమ్మాపల్లి గ్రామంలో చీరతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైనత్య కుమార్ రెడ్డి తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత



నవతెలంగాణ-చేగుంట

విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు గురుదక్షిణగా మంచి ఉత్తీర్ణత అందించాలని మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్‌లు పేర్కొన్నారు. చేగుంట మండలం చందాయపేట గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను తన ముందస్తు పెళ్లిరోజు సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ స్టూడెంట్స్ ఎగ్జామ్స్ బాగా రాసి చందాయిపేట గ్రామాన్ని జిల్లాలో మంచి పేరు తేవాలని ఆకాంక్షిస్తూ టెన్త్ క్లాస్ స్టూడెంట్స్‌ను అందరికీ శుభాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీ వి. కిషన్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బుడ్డసంతోష, సీనియర్ ఉపాధ్యాయులు అజిత, విట్టల్ రెడ్డి, నర్సింలు, సిద్ధ రాములు, బంగారయ్య దామోదర్, సౌజన్య స్వప్న, శ్రీనివాస్, రాములు, సలీం, గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి-మెదక్ వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు చేయాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ
- సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నరసమ్మ



నవతెలంగాణ-వెల్దుర్తి

వెల్దుర్తి నుంచి మెదక్ వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు వెడల్పు చేయాలిని సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి కడారి నరసమ్మ కోరారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి కడారి నరసమ్మ మాట్లాడుతూ బీటీ రోడ్డు నిర్మాణం చేసి కొన్ని ఏళ్ల గడుస్తున్న సంబంధిత ఆర్ అండ్ బీ పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతల మయంగా మారాయన్నారు. దీంతో ప్రయాణికులు నరకాన్ని అనుభవిస్తున్నారన్నారు. వెల్దుర్తి నుంచి ఉప్పులింగాపూర్, రామయ్య పల్లి, శెట్టిపల్లి, మీదుగా మెదక్ వెళ్లే బి టీ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందన్నారు. ఈ రహదారిపై ప్రయాణం చేయడానికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది వాహనాలు నిత్యం ప్రయాణం కొనసాగిస్తాయన్నారు. రోడ్ సక్రమంగా లేక రాత్రి సమయంలో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు రోడ్డు వెడల్పు లేక ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. మండల పరిధి రామయ్యపల్లి బండపోసనపల్లి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో రెండు వరుసల రోడ్డుగా మార్చడానికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కడారి నర్సమ్మ కార్యవర్గ సభ్యుడు ఏ మల్లేశం వెల్దుర్తి మండల కార్యదర్శి గౌరీ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణానికై సంతకాల సేకరణ చేపట్టారు. అదేవిధంగా మెదక్ నుంచి వయా పిల్లికూటాలు, తిమ్మకపల్లి, బొల్లారం, శెట్టిపల్లి, రామయ్యపల్లి, బండ పోసాని పల్లి, కొత్తపల్లి, ఎద్దులపల్లి, ఉప్పులింగపూర్ మీదుగా వెల్దుర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా అనేక గిరిజన తండాల వారు రాకపోకలు జరుపుతారన్నారు. నేటికీ సింగిల్ రోడ్డుగానే ఉండడంతో అనే ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి కొమురయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నరేందర్, రామయపల్లి బండపోసనపల్లి వెల్దుర్తి వివిధ రంగాల కార్మికులు, హమాలీ సంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను సమర్థవంతంగా వరి పంటకు వినియోగించుకోవాలని

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట మండలం ఎల్లాపూర్ శానాయపల్లి పొడిచినపల్లి గ్రామాలలోని ఫతేనగర్ కెనాల్ ఆయకట్టు చివరి నీటిపారుదల వ్యవస్థను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా వరి పంటకు నీటి వనరులు , కెనాల్ కాలువలు, ఆయా ప్రాంతాలలో ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేస్తున్న వరి క్షేత్రాలను పరిశీలించారు. బోరుబావుల కింద సాగవుతున్న వరి పైరు ఏ స్థితిలో ఉంది, సాగునీటి లభ్యత ఏ మేరకు అందుబాటులో ఉందన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. వ్యవసాయ అధికారులను, సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. మిగితా విస్తీర్ణంలో వరి పంట దిగుబడులు చేతికి వచ్చేందుకు ఇంకా ఎంత సమయం పడుతుంది, ఎన్ని తడులు నీరు అవసరం అవుతుంది, గతేడాది యాసంగిలో పంటల పరిస్థితి ఎలా ఉంది, ఏ రకం ధాన్యం సాగు చేస్తున్నారు తదితర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఏ.ఈ విజయ్ కుమార్, సంబంధిత అధికారులు రైతులు తదితరులు ఉన్నారు.

పాపన్నపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-పాపన్నపేట

సంస్థాన్ పాపన్నపేట ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా పాపన్నపేటకు చెందిన భట్టు మోహన్ రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల భాస్కర్, కోశాధికారిగా సంగమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాపన్నపేట మంజీరా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర నాయకుడు మిన్‌పూర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా శ్యాంసుందర్ శర్మ, బి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా శివచరణ్ సింగ్, దుర్గాప్రసాద్, సలహాదారులుగా నాగరాజు, మిన్‌పూర్ శ్రీనివాస్, నవాత్ బాలకిషన్, పి.సుమన్, అంతు నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా బాలరాజ్, అంతు శ్రీనివాస్, జగదీష్, పి.శ్రీనివాస్, మల్లేశంలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మోహన్‌రాజు మాట్లాడుతూ సమిష్టి సహకారంతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రెస్‌క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన కమిటీని సన్మానించారు.

వనదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ నియామక సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతకు ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం కమిటీ బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, అర్చకులు ప్రెస్‌క్లబ్ బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారీ, జర్నలిస్టుల సంక్షేమ కమిటీ సభ్యులు కంది శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు సుమన్, తదితరులు పాల్గొన్నారు. పలువురు నూతన కమిటీని సన్మానించారు.

ఘనంగా జాతర మహోత్సవం

- దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు



నవతెలంగాణ-మనోహరాబాద్

శ్రీ కేతకి భ్రమరాంబ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మండలంలోని మనోహరాబాద్ గ్రామ శివారులో గల దేవాలయం తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన ఉత్సవాలు యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుండే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం కొండపోచమ్మ, మరియు బంగారమ్మ దేవాలయాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతర ఉత్సవాలకు ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, బీజేపి రాష్ట్ర నాయకులు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్, రాష్ట్ర యకులు బాషబోయిన చంద్రశేఖర్‌ముదిరాజ్, నాయకులు పంజా భిక్షపతి, మాజీ ఎంపీపీ అర్జున్ యాదవ్, మాజీ సర్పంచ్ కావేరి భగవాన్‌రెడ్డి, నరేన్‌రెడ్డి, రమేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బండారు భిక్షపతి, బీజేపి మండల పార్టీ అధ్యక్షులు వెంకట్‌గౌడ్, సోములు యాదవ్, మైపాల్‌యాదవ్, సంద ఐలయ్యలతో పాటు అధిక సంఖ్యలో నాయకులు దేవాయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వారికి యాదవ సంఘం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఆహ్వానించారు. ఉదయం నుంచి దేవాలయం వద్ద ఒగ్గు కథలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి జాతర ఉత్సవాలలో పాల్గొన్నారు.

శ్రీవిద్య పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-పాపన్నపేట

శ్రీవిద్య పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా, కరెస్పాండెంట్ నిట్టలాక్ష్మప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలు బోధించారు. కలెక్టర్ గా లక్ష్మీ సహస్ర, డీఈవోగా జూలీ, ఎంఈఓ గా ఐషా ఫాతిమా. ప్రిన్సిపల్ గా అల్బర్ట్ పైక్, 65 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.. విద్యార్థులు ఆంగ్ల భాషలో చక్కగా పాఠాలు బోధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రాజ్. విలాస్. షీలా, దుర్గా, అనురాధ, ప్రియాంక, వసుంధం,. ఇందిరా, సుజాత, స్రవంతి, రేణుక, కృష్ణవేణి, వనజ, సునీత, నిర్మల, విజయ, పల్లవి, వసంత, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మకు బియ్యం అందజేత

నవతెలంగాణ - చేగుంట

చేగుంట పట్టణానికి చెందిన భారతి ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న ప్రజా సేవకుడు అయిత పరంజ్యోతి మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించి అనంతరం దశదిన కర్మలకు 50 కేజీల బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాములు, ఎర్ర యాద గిరి, ఎరుకలి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



బూరుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్ : మండల పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులైన సందర్భంగా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌గా నిహారిక, డీఈవోగా జశ్వంత్, ఎంఈఓ గా రచన, ప్రధానోపాధ్యాయురాలుగా శ్రీ లక్ష్మి, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రాథమిక పాఠశాల గతంలో పనిచేసి న ఉపాధ్యాయులను ఘనం గా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమోహన్, ఉపాధ్యాయులు వెంక గౌడ్, ప్రమోద్ కుమార్,బాల శేఖర్, నరసింహులు, శ్రీలత , సోనీ పాల్గొన్నారు.



పంచాయతికి చెందిన భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు

నవతెలంగాణ-మనోహరాబాద్

ఓ ప్రవేటు వెంచర్‌కు సంబంధించిన భూమిని గతంలోనే గ్రామపంచాయతీకి గిఫ్ట్ డీడ్ చేశారని అట్టి భూమిన కొందరు నాయకులు స్వార్థంతో కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్నారని గ్రామపంచాయతీకి చెందిన వారు పేర్కొన్నారు. భూమికి చుట్టూ కడీలు ఏర్పాటు చేసి కాపాడాలంటూ మాజీ సర్పంచ్ కమ్మరి వెంకటేశంతో పాటు మాజీ వార్డు సభ్యులు అచ్చగోని ప్రభాకర్‌లు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన కాళ్ళాకల్‌లో జరిగింది. వివరాల ప్రకారం గ్రామ శివారులో గల సర్వే నంబర్‌లు 276, 277, 278, 281, 282, 283, 284లలో దాదాపు 22.81 ఎకరాలలో 4-05-2004లో భూమిని కొందరు కొనుగోలు చేసి సాయిసూర్యా పేరుతో వెంచర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అందులో నుంచి 10 శాతం భూమిని ప్రజల సౌకర్యార్థం 02-04-2005లో వెంచర్‌కు చెందిన వారు గ్రామపంచాయతీకి డాక్యూమెంట్ నంబర్ 1792/2005లో గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్టు తెలిపారు. కాని కొంత మంది రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాలతో ఆ భూమి హద్దులను, రోడ్డును తొలగించి ఇతరులకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని వారు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాంటి గ్రామపంచాయతీకి చెందిన భూమిని మోకాపైకి వెళ్లి పరిశీలించి కబ్జాకు గురికాకుండా గ్రామానికి చెందిన భూమిని కాపాడి ప్రజలకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ కమ్మరి వెంకటేశం, మాజీ వార్డు సభ్యులు అచ్చగోని ప్రభాకర్‌లు గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని కొత్త బస్టాప్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటాలకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మెదక్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేయించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మెదక్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు నార్లాపూర్ మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, ఎంఎస్ఎస్ఓ మండల ఇంచార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, టౌన్ అధ్యక్షులు ఎండి నసీరుద్దీన్, మధుసూదన్ రెడ్డి, సూరా రాములు, భాస్కర్ గౌడ్, రజక్ పల్లి నీల కనకరాజు, సామల మహేష్, పాల్గొన్నారు.

హిందు సమాజం సనాతన ధర్మాన్ని కాపాడాలి

- మహాదేవ స్వామి

నవతెలంగాణ-కొమురవెల్లి

హిందూ సమాజం సనాతన ధర్మాన్ని కాపాడాలని సద్గురు మహాదేవ్ స్వామి అన్నారు. ఈనెల 12న కొలనుపాకలో జరిగే జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా కామరెడ్డి జిల్లా గాంధారి మండలం గుడిమెట్ గ్రామం నుంచి ఈనెల 6వతేది న సుమారు పన్నెండు వందల మందితో ప్రారంభమైన రేణుకాచార్య మహాపాదయాత్ర మంగళవారం కొమురవెల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, ఆలయ అర్చకులు సద్గురు మహదేవ్ స్వామికి ఆహ్వానం పలుకగా పాదయాత్రగా వచ్చిన భక్తులు మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ధర్మసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసభలో సిద్దాంత శిఖామణి ప్రవచణాలు. సనాతన హిందూ ధర్మంపై వివరించారు. అనంతరం సద్గురు మహదేవ్ మాట్లాడారు. రాష్ట్ర అర్చక ఉద్యోగ జెఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర వీర శైవ సమాజము నాయకులు మహదేవుని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పడిగన్నగారి నాగయ్య పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చెయ్యొద్దు

- బీజేపీ జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేష్ గౌడ్,
- ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తా



నవతెలంగాణ-నర్సాపూర్

విష కాలుష్యాన్ని వెదజల్లే డంపింగ్ యార్డ్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. నర్సాపూర్ పట్టణంలో, గుమ్మడిదల మండలం ప్యారా నగర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా మంగళవారం నర్సాపూర్ పట్టణానికి చెందిన మార్వాడి సంఘం సభ్యులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. వీరికి బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత పైడి శ్రీధర్ గుప్తాలు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చని పంటలతో కళకళలాడే ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి విషపూరితంగా మార్చొద్దని హెచ్చరించారు. డంపింగ్ యార్డు ఏర్పాటును వెంటనే నిలిపివే యాలని, లేకుంటే ఈ ప్రాంత ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతమని వారు హెచ్చరించారు. ఈ దీక్షలో రమణ రావు, బిక్షపతి, మార్వాడి సంఘం సభ్యులు కూర్చున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
బుధవారం | 12 మార్చి 2025 | www.navatelangana.com

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్



నవతెలంగాణ-సిద్ధిపేట

విద్యారంగానికి 30 శాతం నిధులు బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ భాను, ఆముదాల రంజిత్ రెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యారంగం అభివృద్ధి చెందుతే, అన్ని రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్షిప్, ఫీజు రీమిక్స్ మెంట్ బకాయిలు ఉన్నాయని, బకాయిల మూలంగా విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఐదేండ్ల నుంచి రూ.8వేల కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు కోనేరు ప్రవీణ్ కుమార్, జిల్లా నాయకులు విక్రం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్

నవతెలంగాణ-సిద్ధిపేట



పెండింగ్‌లో ఉన్న 5 డీఏలు, బకాయిలు చెల్లించాలని, వెంటనే పీఆర్సీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీట 10వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీజేఆర్ భవన్ లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ముస్త్యాల యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పంబాల ఎల్లయ్య కోశాధికారిగా చద్రి కిషన్, గౌరవ సలహాదారులు కనకయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులు ముస్త్యాల యాదగిరి మాట్లాడుతూ.. గత సంవత్సరములో 10వ తరగతి పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రావలసిన రెమ్యునరేషన్, మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రావలసిన డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇందూరులో ఆన్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్

- సదర్ ల్యాండ్‌కు 25 మంది విద్యార్థులు ఎంపిక
- కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విపి రాజు



నవతెలంగాణ-సిద్ధిపేటఅర్బన్

సదర్ ల్యాండ్ సాఫ్ట్వేర్‌లుగా ఇందూర్ కళాశాల విద్యార్థులు 25 మంది ఎంపిక అయినట్లు ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విపి రాజు మం గళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో సదర్ ల్యాండ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్మెంట్‌కి బీటెక్ 2024-25 సంవత్సరపు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్లైన్ పరీక్ష గ్రూప్ డిస్కషన్ హెచ్ఆర్ ఇంటర్వ్యూ లాంటి మూడు పద్ధతుల ద్వారా 25 మంది విద్యా ర్థులను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. వీరందరూ సాఫ్ట్వేర్ హోదాలో సంవ త్సరానికి మూడు లక్షల జీతభత్యంతో ఉద్యోగంలో చేరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రవీణ్, హెచ్ ఆర్ మేనేజర్ అనూష, ఇందూర్ ప్లేస్మెంట్ ఆఫీసర్ గోపికృష్ణ, పీఆర్ఓ బొడ్డు రఘు తదితరులు పాల్గొన్నారు.

వధువరులను ఆశీర్వదించిన వంగ రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

నవతెలంగాణ సీనియర్ విలేకరి సొప్పరి రాములు-మంజుల రెండో కుమారుడు హరిచరణ్ -కృష్ణవేణిల వివా హం ఇటీవలే జరిగిన విష యం తెలిసిందే. సోమవారం రాత్రి ప్రముఖ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి విలేకరి ఇంటికి వెళ్ళి వధువరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్, అంజి గౌడ్, అనిల్ యాదవ్, ప్రశాంత్, కరుణాకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

మండల పరిధిలోని వెంక టాపూర్ గ్రామంలో ఎంజీఎస్ ఆర్ఈజీఎస్ రూ.15 లక్షలతో సీసీ రోడ్డు ఎస్‌డీఎఫ్ రూ.6 లక్ష లతో డ్రైనేజీ పనులకు మంగ ళవారం కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ కాంగ్రెస్ నాయకులతో కలిపి శంకుస్థాపన చేశారు. కుర్మా సంఘం నిర్మిస్తున్న బీరప్ప గుడినీ సందర్శించి గుడి నిర్మాణంకు నిధులు త్వరలో మంజూరు చేస్తానని ఆమె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, మండల శాఖ గుర్రం అంజి రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పథకం ఇండ్లకు శంకుస్థాపన



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిడం జరిగిందని బావానందపూర్ కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు చింతకాయల కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బావానందపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు చిట్టమైన సౌందర్య, చింతకాయల భారతి ఇండ్లకు ముగ్గు పోశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ ఎంపీడీవో అశోక్, కాంగ్రెస్ మర్కుక్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, పంచాయతి కార్యదర్శి సత్యానారాయణ, లబ్ధి దారులు, తదితరులున్నారు.

రాయపోల్ తహసీల్దార్ బదిలీ

నవతెలంగాణ-రాయపోల్


తహసీల్దార్ దివ్య

రాయపోల్ మండల తాహసిల్దారుగా గత రెండు ఏండ్లుగా విధులు నిర్వహించిన తహసీల్దార్ దివ్య బదిలీపై కొమరవెల్లి మండలానికి వెళ్లారు. కాగా రాయపోల్ నూతన తహసిల్దార్‌గా డీఏఓ ఈ శ్రీనివాస్‌ను రాయపోల్ తహసీల్దారుగా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విలువరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మాను చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దారుగా ఎవరు వచ్చినా సామాన్య రైతుల సమస్యలు పరిష్కారం కావాలని రైతులు నిత్యం కార్యాలయం చుట్టూ తిరిగి విసిగెత్తిపోకుండా పనిచేయాలని రైతులు ఆశిస్తున్నారు.

విద్యార్థి ప్రతిభకు పురస్కారం

- స్పైర్ అవార్డుకు గురుకులం విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-మిరుదొడ్డి

శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ రఘునందన్ రావు పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రాజెక్టు నమూనాలకు మిరుదొడ్డి మండలం అల్వాల-చేప్యాల కూడలిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంకు చెందిన పదో తరగతి నితిన్ ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భావిశాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. నితిన్ రూపొందించే ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 10 వేలు చొప్పున మంజూరు చేస్తుందన్నారు. తయారు చేసిన నమూనాను ఇన్ స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ లో ప్రదర్శిస్తారని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు ఉన్నట్టే.. పంటలు మాత్రం ఎండుతున్నాయి

- నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకునేనా..!



నవతెలంగాణ-సిద్ధిపేట

ఏ పంట చేతికి అందాలన్నా నీటి లభ్యత చాలా అవసరం. నీరు ఉంటేనే రైతులు పడిన కష్టానికి ఫలితం వచ్చేది. ఆ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వం జిల్లాలో ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ వాటి నుంచి వ్యవసాయ పొలాలకు పిల్ల కాలువలు తవ్వకపోవడంతో జిల్లాలో ప్రాజెక్టులు ఉన్న, పంటలు మాత్రం ఎండిపోతూనే ఉన్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతులు పంట చేతికి వచ్చే సమయంలో తమ కళ్ళముందే పంట ఎండిపోవడంతో వారి మనోవేదనకు ఎంత నష్టపరిహారం ఇచ్చిన తక్కువే. ఏ రైతైనా తాను కష్టపడి పండించిన పంట చేతికొచ్చి, తన మూలంగా ప్రజలకు ఆహారము లభిస్తే చాలు అదే తృప్తి అని భావిస్తారు. కానీ తనకే ఆహారం లభిస్తుందో లేదో అన్న భావనలో రైతులు ప్రస్తుతం ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో నీటి లభ్యత లేకపోవడంతో వేల ఎకరాలలో వరి పంట ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాలో ఉన్న ప్రాజెక్టులలో నీటిని నింపి, వాటి ద్వారా చెరువులను నింపాలని, వాటి ద్వారా తమ పొలాలకి నీరు లభిస్తుందని కోరుతున్నారు.

జిల్లాలో 3.50 లక్షల ఎకరాలలో వరి పంట...


జిల్లాలో రైతులు 3.50 లక్షలు ఎకరాల్లో వరి పంటను వేశారు. ఒక ఎకరాకు సుమారుగా రైతులు రూ.50వేల వరకు ఖర్చు చేస్తారు. విత్తనాలు, ఎరువులు, కూలీలు, దున్నకాల కోసం ఖర్చు చేస్తూ ఉంటారు. జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారుగా 30వేల ఎకరాల వరకు నీరు అందక ఎండిపోయిందని రైతులు చెబుతున్నారు. కానీ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం 12వేలు ఎకరాల వరకు వరి పంట ఎండిపోయిందని తెలిపారు.

ప్రాజెక్టులు ఉన్న ఏం లాభం

జిల్లాలో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్ట్, గౌరవెల్లి, శనిగరం ప్రాజెక్టు, తపస్ పల్లి ప్రాజెక్టులు ఉన్నాయి. కానీ నీటి వాడకంలో సరైన ప్రణాళికలు లేకపోవడంతో, ఉన్న నీటిని కాలువల ద్వారా చెరువులు నింపడం, కాలువల ద్వారా పంట పొలాలకు నీరు అందించడంలో సరైన ప్రణాళికలు లేకపోవడంతోనే పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా నిర్మాణమైన ప్రాజెక్టుల నుంచి పంట పొలాలకు పిల్ల కాలువలు తవ్వకపోవడంతో అవి ఉన్నప్పటి కూడా నీటిని ఉపయోగించుకోక పోతున్నామని బాధ రైతులలో ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్న నీటిని జిల్లాలో ఉన్న వ్యవసాయ పొలాలకు అందే విధంగా పిల్ల కాలువలు తవ్వాలని, నీటిని అందించాలని కోరుతున్నారు.

రూ.50వేల వరకు నష్టం

నరసయ్య , రైతు, కొండపాక.



ఎకరం భూమిలో వరి పంట వేశాను. రూ.50 వేల వరకు ఖర్చులు అయ్యాయి. పంట బాగానే పెరిగింది. కానీ నీరు అందకపోవడంతో పంట మొత్తం ఎండిపోయింది. వరి పంటకు గొలుసు వచ్చినప్పటికీ, అందులో ఇత్తు లేక తాలుగానే ఉన్నది. నీళ్లు ఉంటే తాను బతికే వాడినని, ఇతరులకు భోజనానికి వడ్లు అందించే వాడినని బాధపడ్డాడు.

తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసుకోవాలి

- వరి పంట పొలాలను సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-కొండపాక

తక్కువ నీటితో పండే పంటలు సాగు చేసి ఎక్కువ లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక అన్నారు. మంగళవారం కొండపాకలో పంట పొలాలను సందర్శించారు. యాసంగిలో తక్కువ నీటితో పండే మొక్క జొన్న, పొద్దు తిరుగుడు, కూరగాయల పంటలను సాగు చేసి అధిక లాభాలు పొందాలన్నారు. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు వర్షాలు పడకపోవడం వల్ల భూమిలో నీటి లభ్యత తగ్గిందన్నారు. తపాస్ పల్లి నుంచి కాలువల ద్వారా సాగునీరు అందించే చర్యలు ప్రభుత్వం తీసుకుంటుం దన్నారు. బోర్లలో నీటి లభ్యత తగ్గి పంటకు సరిపడా నీరు అందించలేకపోతున్నామని దానివలన పంటలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. పంటలను కాపాడుకోవడం కోసం నానా రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. నీరు అందక కళ్ళముందటే పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు. సాగునీరు అందించి పంటలను కాపాడాలని కోరారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

ధర్నాకు అనుమతి ఇవ్వండి

- బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కొండపాక

పంటలన్నీ నీరు లేక ఎండిపోతున్నాయి. కళ్ళముందటే వేసిన పంటలు ఎండిపోతుంటే రైతులు బావురమంటున్నారు. ప్రభుత్వం మాత్రం ఏమి పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. తపాస్ పల్లి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడంలేదని ఈ నెల 13న రాజీవ్ రహదారిపై రైతులతో ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని దానికి అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు నూనె కుమార్, రాగల దుర్గయ్య, మహిపాల్ రెడ్డి,పెద్దంకుల శ్రీనివాస్ లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంట పొలాలకు నీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో కొండపాక మండలంలో తపాస్ పల్లి కాలువ ద్వారా చెరువులను నింపి పంటలను కాపాడమని ప్రస్తుతం కొండపాక మండలానికి తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి చుక్కనీరు రావడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 13న ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేర రహిత సమాజ నిర్మాణానికి జర్నలిస్టు, పోలీసుల పాత్ర కీలకం

- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్

సమాజంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు రూపుమాపి మెరుగైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు, పోలీసుల పాత్ర కీలకమని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ డైరీ క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి ఆధ్వర్యం రిలీజ్ చెసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరిగే ఆ సాంఘిక కార్యకలాపాలను తమ దృష్టికి తీసుకురావాలని వాటిని రూపుమాపేందుకు పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. చట్టం పరిధిలో ప్రజలు పనిచేయాలని మద్యం మాదకద్రవ్యాలు పేకాట గొడవలు లాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణంలో పౌరులందరూ బాధ్యతగా ఉండాలని పిలుపునిచ్చారు. పోలీసులు రక్షణ కవచంగా నిరంతరం పనిచేస్తున్నారని, దానికి జర్నలిస్టులో బాధ్యతగా సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, జర్నలిస్ట్ లు గుడాల శేఖర్, ఎల్లం రాజు, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- పంటలు ఎండుతున్న పాపం కేసీఆర్, హరీశ్‌లదే
- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి



నవతెలంగాణ-నంగునూరు

రైతుల శ్రేయస్సు కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని ఘనపూర్ గ్రామంలోని చెక్ డ్యాం గోదావరి నీళ్లతో నిండి పొంగి పొర్లుతున్న నంగునూరు, అక్కెనపల్లి చెక్ డ్యాం లోకి వెళ్తున్న సందర్భంగా గ్రామ ప్రజలు ,కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి కొబ్బరికాయలు కొట్టి, పసుపు కుంకుమ చల్లి మంగళహారతి ఇచ్చి ఘనంగా పూజలు చేశారు. అనంతరం వారు వాగవతళి ఐదు గ్రామాలలో భూగర్భజలాలు అడుగంటకుండా నీటి శాతం పెరుగుట కోసం మోయి తుమ్మెద వాగు పైన నంగునూరు, ఘనపూర్ అక్కెనపల్లి గ్రామాలలో ఆరు చెక్ డ్యాం ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. రైతుల పక్షపాతి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నపుడు బలాదూర్ తిరిగిన హరీశ్ ఇప్పుడు, తప్పు డు ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని బదునాం చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తప్పెట శంకర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయ కులు బాగు శ్రీకాంత్ యాదవ్,మాజీ సర్పంచులు తిప్పని రమేశ్,రవీంద్ర చారి, చేర్యాల బాలయ్య నాయకులు, పాల్గొన్నారు.

నడవండి..ఆరోగ్యాన్ని కాపాడుకోండి

- మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

నడవండి, ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళ వారం గజ్వేల్ పట్టణంలో సూర్య నమస్కారాల బృందం సభ్యులు చేసే సూర్య నమస్కారాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నడకతో పాటు సూర్య నమస్కారాలు ఆరోగ్యానికి ఎంతో నయం చేస్తాయని అన్నారు. గత ఏడు ఏండ్లుగా సూర్య నమస్కార బృందం గజ్వేల్ పట్టణంలో ఉదయం 5 గంటల నుంచి 6.15 వరకు నడకా నమస్కారాలు చేస్తున్నారన్నారు. దాదాపు 50 మంది వరకు ఈ బృందంలో నిత్యం వ్యాయామం చేస్తున్నరంతో ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఇందులో ఉపాధ్యాయులు, బిజినెస్ యజమానులు, జర్నలిస్టులు ఉన్నారన్నారు. గజ్వేల్ పట్టణ నలు మూలల నుండి నడక ద్వారా ముట్రాజ్ పల్లి మహిళా భవన్ వద్ద సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వర్షాకాలంలో సూర్య నమస్కారాల కార్యక్రమాలకు ఇబ్బందులు వస్తున్నాయని తన దృష్టికి తీసుకువచ్చినారని జిమ్ము వద్ద ఉన్న స్థలంలో కొంత భాగాన్ని షెడ్యూను నిర్మించేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, సమీర్, సూర్య నమస్కారాల బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు



నవతెలంగాణ-సిద్ధిపేట

ఖైదీలు ఉండే జైలు కంటే కేసీఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఇరుకుగా, వెళ్తురు లేకుండా ఉందని, ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుడిగందుల రవి, చంద్లాపురం మధులు అన్నారు. మంగళవారం కేసీఆర్ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయిమరీ పాఠశాలలో 150 మంది విద్యార్థులు, ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారని, వారికి కేటాయించిన తరగతుల్లో కేవలం 20 మంది మాత్రమే కూర్చోవడానికి సరిపడా స్థలం ఉందనీ, క్లాస్ రూమ్‌లో కనీసం కరెంట్ సప్లై లేదనీ, ఫ్యాన్లు లేవనీ, లైట్లు లేవనీ, బెంచీలు లేవనీ అన్నారు. అమ్మాయిలకు అరకొర బాత్రూంలు ఉన్నాయనీ, అబ్బాయిలకు ఒక్క బాత్రూం కూడా లేకపోవడం వల్ల వాళ్లు రోడ్లపైకి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. వర్షం పడ్డ, ఎండ కొట్టినా బయటే ఉండి మధ్యాహ్న భోజనాన్ని తినే పరిస్థితి అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని సమస్యలు పరిష్కరించాలని, సౌకర్యాలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వినయ్, శ్రావణ్, రాజు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్



గత కొంత కాలంగా మద్యానికి బానిసకాగా కొద్దిరోజుల క్రితం కుటుంబ సభ్యులు మందలించి అతనితో మద్యం మాన్పించడంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. మండల కేంద్రానికి చెందిన బ్యాగరి శ్రీను (45) వ్యవసాయం, హమాలీ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం గజ్వేల్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత భార్య చంద్రకళతో తనకు డబ్బులు ఇవ్వాలని గొడవపడగా, ఆమె డబ్బులు ఇవ్వనని నిరాకరించడంతో మనస్థాపం చెంది, రాత్రి ఇంట్లో నుంచి వెళ్ళిపోయి, గ్రామ శివారులో వ్యవసాయ పొలాల వద్ద చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో శ్రీను కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతుకగా గ్రామ శివారులో చెట్టుకి ఉరి వేసుకున్న దృశ్యం చూసారు. మద్యానికి డబ్బులు ఇవ్వని కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-మద్దూరు



పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సిద్ధిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా దూళ్మిట్ట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. విద్యార్థులు రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

ఘనపూర్ చెక్ డ్యాం వద్ద జల హారతి

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం ఘనపూర్ చెక్ డ్యామ్‌లోకి రంగనాయక సాగర్ కుడి కాల్వల ద్వారా నీరు రావడంతో మంగళవారం ఘనపూర్ రైతులు జలహారతి కార్యక్రమం చేపట్టారు. మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో చౌటచెరువు మత్తడి దూకి పెద్దోళ్ల బంగ్లా పరిసరాల్లో చెక్ డ్యాం నిండి ఘనపూర్ చెక్ డ్యాం నిండి నీళ్ళు వెలుతున్నాయి. దీంతో ఘనపూర్ గ్రామస్తులు మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల ఫ్లెక్సీలకు జలాభిషేకం చేశారు. పెద్ద వాగు పరిసర ప్రాంతాల్లో నీరు లేక ఎండిపోతున్న పంటలకు ప్రాణవాయువు దొరికినట్లు అయింది. వాగుపై నిర్మించిన మరో మూడు చెక్ డ్యాం లోకి నీళ్ళు వస్తే యాసంగి సీజన్ నీటి బెడద నుంచి ఉపశమనం కలుగుతోందని రైతులు అంటున్నారు. గ్రామానికి చెందిన రైతులు, వాగు పరిసర ప్రాంతాల ఆయకట్టు రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా తరలివచ్చి జలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అడుగంటిన భూగర్భ జలాలు

- నీరు లేక ఎండు ముఖం పట్టిన వరి పంట



నవతెలంగాణ-మిరుదొడ్డి

వరి పంట సాగు చేసిన అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. కష్టపడి సాగు చేసిన వరి పంటకు నీరు అందక తల్లడిల్లాల్సిన పరిస్థితి నెలకొంది. చేతికందే సమయంలో ఎండు ముఖం పట్టిన వరి పంట పశువులకు మేతగా మారింది.

సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం వ్యాప్తంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. రోజురోజుకు భూగర్భ జలా లు అడుగంటి పోవ డంతో బోరు బావులు వరి పం టకు సరిపడా సాగు నీరు అందించలేక వెనకా డుతున్నాయి. రైతులు వేసిన పంట పొలాలో నీరు సక్రమంగా రాకపోవడంతో ఆవేదన చెందుతున్న రైతన్నలు. ఎకరాకు సుమారుగా రూ.20 నుంచి రూ.25 వేలను వ్యవసాయానికి ఖర్చుపెట్టిన రైతు పంట మధ్యలోనే బోరు పోయాక ఎండిపోవడంతో రైతులకు ధీమా ఎవరని అంటున్నా రైతన్నలు బోరున విలపిస్తున్నారు. ఎండిపోయిన పంటలలో పశువులను మేపాల్సి వస్తుందని రైతులు కంటతడి పెడుతున్నారు.

మల్లన్న సాగర్ ఉపకాల్వ పనులు వేగవంతం చేసి సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. కాల్వల ద్వారా చెరువులు, కుంటలను నింపితే భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో పాటు సాగునీరు రైతులకు పుష్కలంగా లభించే అవకాశం ఉంటుందన్నారు. పంట లకు సరిపడా సాగునీరు అందకపోతే పంటలు వేయలేక, అప్పులు తీర్చే మార్గం లేదని ఇలాంటి పరిస్థితి నెలకొంటే ఆత్మహత్యలే శరణ్యంమంటున్నారు రైతన్నలు. ప్రభుత్వం వెంటనే పంటలకు సాగునీరు అందించే విధంగా ప్రణాళికలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

4 ఎకరాల వరిపంట వేశాను

-దుర్గులు రైతు ధర్మారం




మేము వ్యవసాయ చేసి కాలం గడిపే వాళ్ళము వ్యవసాయం చేస్తేనే పూట గడిచేది. నాకు నాలుగెకరాల వ్యవసాయ పొలం ఉంది. మా గ్రామంలో భూగర్భ జలాలు అడగడంతో వ్యవసాయ బోరు సక్రమంగా పోయడం లేదు. ప్రభుత్వము మమ్మల్ని ఆదుకోవాలి. ఎకరాకు రూ.20 నుండి రూ.25 వేలు ఖర్చు అయింది. వేసిన పంట మధ్యలోనే నీరు లేక ఎండిపోతూ ఉన్నాయి అధికారులు స్పందించి అర్హులైన మా రైతులను గుర్తించి మాకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందే విధంగా చూడాలి.

విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా చదువుకోవాలి

-మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు

నవతెలంగాణ-దౌల్తాబాద్



పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృధా చేసుకోకుండా వార్షిక పరీక్షల కోసం శ్రద్ధగా చదువుకోవాలని దౌల్తాబాద్ మండల విద్యాశాఖ అధికారి గజ్జల కనకరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి ప్రత్యేక తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ప్రీ ఫైనల్ పరీక్షల్లో భాగంగా విద్యార్థులు భౌతిక శాస్త్రం సబ్జెక్టును ప్రాక్టీస్ చేస్తున్నారు. వార్షిక పరీక్షలకు అతి తక్కువ సమయం ఉంది. కాబట్టి అసలు సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకుంటేనే మీరు విజయవంతంగా పరీక్షలు రాయగలుగుతారని విద్యార్థులు సూచనలు చేశారన్నారు. అన్ని సబ్జెక్టులను ఇష్టంతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు మహేష్ రెడ్డి, సీఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 5

సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 12 మార్చి 2025 | www.navatelangana.com

రిజర్వేషన్ చట్టం అమలయ్యే వరకు నోటిఫికేషన్లు వద్దు

నవతెలంగాణ-అక్కన్నపేట



మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు అక్కన్నపేట మండలం ఎంఆర్ పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండల సీనియర్ నాయకులు తొండూరి ఎల్లయ్య మాదిగ, కొడముంజ బాలరాజు, మొలుగూరి సునీతలు కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చేవరకు ప్రభుత్వం నోటిఫికేషన్లు గ్రూప్ పరీక్ష ఫలితాలు నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షులు ముత్యాల శ్యామ్ కిరణ్ మాదిగ, ఎంఎస్పీ అక్కన్నపేట మండల అధ్యక్షులు జన్నె రవీందర్, బీఆర్ఎస్ అక్కన్నపేట మండల అధ్యక్షులు పెసరు సాంబరాజ్, తదితరులు, దీక్షలో పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

నవతెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ను పట్టుకొని రూ.10వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ మధుసూదన్, మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బైరాన్ పల్లి వాగు నుంచి ఇసుక నింపుకొని బెక్కల్, మీదుగా టీఎస్ 36 ఎస్ 5143 నెంబర్ గల ట్రాక్టర్‌లో తిగుళ్ళ నాగరాజు, అనే వ్యక్తి ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో పట్టుకొని రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

సైక్లింగ్ క్రీడాకారులను అభినందించిన డాక్టర్



నవతెలంగాణ-సిద్ధిపేట

9వ రాష్ట్ర స్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్ పోటీల్లో పట్టణంలోని ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ విద్యార్థులు 12 మెడల్స్ సాధించి నందుకు డాక్టర్ అరవింద్ కుమార్ వారిని అభినందించారు. ఆదివారం కేలో ఇండియా సెంటర్ లో క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా సెంటర్ శిక్షకులు సంజీవ్ మాట్లాడుతూ.. 9వ రాష్ట్రస్థాయి మౌంటెన్ బైక్ సైక్లింగ్ పోటీల్లో 4 బంగారు మెడల్స్, 2 సిల్వర్ మెడల్స్, 2 బ్రాంచ్ మెడల్స్ సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కాటం శ్రీనివాస్, వేణు, వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా దేవాలయం పనులు

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వాసవి కమలం దేవాలయం నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి అన్నారు. మంగళవారం ఆయన పనులను పరిశీలించి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ నేతృత్వంలో అన్ని వర్గాల ప్రజలకు చేకూర్చే విధంగా కృషి చేసి ఆర్యవైశ్యులకు అండగా నిలిచి ఆర్యవైశ్య భవనం కోసం కేటాయించిన స్థలంలో ఆర్యవైశ్య భవనం కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణం నిర్మాణం జరుగుతుందన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారని, ఆలయ నిర్మాణానికి ఇంకా దాతల అవసరం ఎంతో ఉందన్నారు. కమలం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి దాతలు ఎవరైనా ఉంటే ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు గెలుపు ఖాయం



నవతెలంగాణ-మర్కుక్ : తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ విద్యార్థి నాయకుడు, సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పరిశో ధకుడు డా. దాసోజు శ్రవణ్ మాజీ విద్యార్థి నాయకుడు, సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పరిశోధకుడు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన బీఆర్ఎస్ దళపతి మాజీ సీఎం కేసీఆర్‌కు మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ నేత శ్రవణ్‌కు ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ తరపున నామినేషన్ వేయడం శుభ పరిణామమన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గా దాసోజు శ్రవణ్ గెలవడం నల్లేరు మీద నడక అన్నారు.

ప్రణయ్ తీర్పు కనువిప్పు కావాలి

-డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

నవతెలంగాణ-గజ్వేల్

కులాంతర, మతంతర వివాహలను అడ్డుకునే వాళ్ళకు ప్రణయ్ తీర్పు కనువిప్పు కావాలని మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, మైసయ్య మాట్లాడారు. 2018లో మిర్యాలగూడకు చెందిన ప్రణయ్, అమృత వర్షిణి ప్రేమ వివాహం చేసుకోవడంతో కులాలు వేరు కావడం వలన పరువుపోయిందని అమృత తండ్రి మారుతిరావు పథకం ప్రకారం సుఫారితో ప్రణయ్‌ను హతమార్చిన ఘటనందు తప్పును తెలుసుకొని కలతచెంది మారుతిరావు హత్మహత్య చేసుకోవటం జరిగిందన్నారు. కులదురంహకార హత్యకు గురైన ప్రణయ్ హంతకులకు ఒకరికి ఉరి శిక్ష, అరుగురికి జీవిత ఖైది నల్గొండ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అదనపు కోర్టు తీర్పు ఇవ్వటం పట్లపరువు హత్యలు చేసేవాళ్ళకు కనువిప్పుకలుగాలన్నారు. ఇటువంటి ఘటనలు చేసే వాళ్ళకు ఇకనైన మానుకొని మనుసులను అర్థం చేసుకొని సమాజంలో మార్పును గమణించాలన్నారు.

బూతుల పురాణం మానుకోండి

-ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ : బూతుల పురాణం మాట్లాడడం మానుకొని ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలుపై దృష్టి పెట్టాలని ఎఫ్డీసీ మాజీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమస్యలు ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వారసులు బూతు పురాణము ముందుకు వేసుకుంటున్నారని అన్నారు. రైతులకు సాగునీరు అందించి వారి వారి కంటిలో ఆనందాన్ని నింపాలని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనుల కోసం గతంలో కేసీఆర్ రూ.180 కోట్లను మంజూరు చేయగా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. తిరిగి ఆ నిధులను మంజూరు చేసుకొని గజ్వేల్ అభివృద్ధి చేయాలని కోరారు. మల్లన్న సాగర్ నిర్వాసితుల 10 శాతం పనులను ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. రూ.100 కోట్లు నిధులు విడుదల చేసి నిర్వాసితుల సమస్యలు తీర్చాలని కోరారు.

సిద్దిపేటలో కోటి తలంబ్రాల దీక్ష

నవతెలంగాణ-సిద్ధిపేట



భద్రాచలం రాములవారి కళ్యాణానికి గోటితో ఒలిచిన తలంబ్రాలను పంపించడానికి తమకు మూడోసారి అవకాశం రావడం సంతోషంగా ఉందని, సిద్ధిపేటలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గోటితో ఒలిచి తలంబ్రాలు తయారు చేస్తున్నారని శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకులు రామకోటి రామరాజు తెలిపారు. మంగళవారం గణేష్ నగర్ లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్ష ఘనంగా నిర్వహించారు. 200 మంది భక్తులు పాల్గొని రామనామ స్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి రామకోటి రామరాజుకే అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పెందోటి శ్రీనివాస్, చంద్రమౌళి, రవి, వెంకటేష్, అర్చకులు వెంకటరమణచారి, సీతారామాంజనేయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గడ్డపోతారంలో ఎల్లమ్మ జాతర

నవతెలంగాణ-జిన్నారం : జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీ ప్రాంతంలో ఎల్లమ్మ కళ్యాణోత్సవాలను గ్రామస్తులు నిర్వాహక బృందం మంగళవారం సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద మాజీ ఉపసర్పంచ్ మమతా పెంటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కల్యాణోత్సవం కార్యక్రమంలో స్థానికులు సమీప గ్రామాల వారు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అధికారం ఉంటే ఒక మాట... కోల్పోతే మరో మాట

- దశాబ్ద కాలంగా పేదల జీవితాలతో ఆడుకుంటున్న రాజకీయ పార్టీలు
- సీపీఐ (ఎం) పోరాటంతో కదిలిన అధికారులు.

నవతెలంగాణ-గజ్వేల్

దశాబ్ద కాలంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరిట రాజకీయ పార్టీలు పేదల జీవితాలతో ఆడుకుంటున్నాయి. ఇల్లు ఇస్తామంటే ఆశ అనే పదంతో పేదలను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాజకీయంగా వాడేసుకుంటున్నాయి. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు నిర్మించి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇళ్లను కేటాయించలేకపోయింది. ఇల్లు కేటాయించాలని అప్పటి ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ పేదల చుట్టూ తిరుగుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇప్పిస్తామని ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించింది. పేదలు పెట్టుకున్న 3600 దరఖాస్తులకు గాను 1250 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పేదలకు దక్కని డబుల్ ఇండ్లు

గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా పేదలకు ఇండ్లు దక్కలేకపోయాయి. ఎన్నికల ముందు మరోసారి ఓట్లు వేసుకుందామని గత ప్రభుత్వంలో పనిచేసిన ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేసి డ్రా పద్ధతిని తీసుకొచ్చారు. 1150 మందికి డ్రా పద్ధతిలో ఎంపిక చేసినప్పటికీ వారికి ఇవ్వలేకపోయారు. మరికొందరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కావాలని అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయారు.

రాజకీయం కోసం పాకులాడుతున్నారు

అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ఇప్పుడు రాజకీయం కోసం పేదలను అడ్డం పెట్టుకొని ప్రాకులాడుతుంది. అధికారం ఉన్నప్పుడు ఇవ్వని ఇండ్లు ప్రతిపక్షంలో ఎలా ఇస్తారని పేదలు ప్రశ్నిస్తున్నారు. 15 నెలల్లో బీఆర్ఎస్ పేదలను రోడ్డుపైకి తీసుకొచ్చి నిరసనలు వ్యక్తం చేస్తుంది. ఈ విషయంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, జిల్లా కలెక్టర్‌ను చాలా సార్లు కలిసి పేదలకు ఇండ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మల్లన్న సాగర్ నిర్వాసితులు ఉన్నందున పూర్తి ప్యాకేజీ వచ్చిన నిర్వాసితులను ఇండ్లను ఖాళీ చేసేలా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు.

10 సంవత్సరాల్లో ఏం చేశారు..

కాంగ్రెస్ మూలంగానే ఆలస్యం అవుతుందన్న బీఆర్ఎస్ నాయకులు పది సంవత్సరంలో ఏం చేశారని అధికార పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. పేదల చుట్టూ రీ రాజకీయాలు చేస్తూ కాలం గడుపుతున్నారు. డ్రా పద్ధతిలో ఇల్లు దక్కించుకున్న వారు అధికారుల చుట్టూ తిరిగి తిరిగి చాలించుకున్నారు. మరికొందరు ఇంకా అధికారుల చుట్టూ అధికార పార్టీ చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల ఆలస్యం అవుతుందని అధికార పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు. తాజాగా శుక్రవారం బీఆర్ ఎస్ నాయకులు ప్రతాప్ రెడ్డి పేదలను రోడ్డుపై తెచ్చి ఆర్డిఓ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డిఓకు వినతిపత్రం అందించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పని ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులు చేస్తున్నారు. ఆర్డీవోలు సర్వేలు చేస్తున్నప్పటికీ పూర్తి ప్యాకేజీ వచ్చిన తర్వాతనే తాము ఖాళీ చేస్తామని అధికారులకు చెప్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి మల్లన్న సాగర్ నిర్వాసితులకు రావలసిన ప్యాకేజీ, ప్లాట్లు, ఒంటరి మహిళలను ఆదుకోవడం వంటి చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఔ

రెండు పార్టీలకు సీపీఎం చెక్

ఇరు పార్టీల కుళ్ళు రాజకీయాలకు చెక్ పెట్టేలా సిపిఐ (ఎం) డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేదలకు ఇవ్వాలని పోరాటం సాగించింది. దీంతో కొందరికి నిర్వాసితులు కాలిచేసిన ఇండ్లలో పేదలకు ఇండ్లు అందజేశారు. మిగతా వారికి కూడా అందించాలని అనేకసార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు వినతి పత్రాలు అందించారు. దీనిపై స్పందించిన అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న మల్లన్న సాగర్ నిర్వాసితులను సర్వే నిర్వహించి పూర్తి ప్యాకేజీ వచ్చిన వారిని గుర్తించి ఖాళీ చేయించి అందులో లాటరీ పద్ధతిలో వచ్చిన వారికి ఇళ్లను అప్పగించారు. మిగతా పార్టీల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది.

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

నవతెలంగాణ-తొగుట

ఎన్నికల హామీల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని గ్రామ బీజేపీ సీనియర్ నాయకుడు, మండల ఉపాధ్యక్షులు ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం కాన్గల్ గ్రామంలో మెదక్ ఎంపీ మాధవ నేని రఘునందన్ రావు సహకారంతో రూ.5 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామస్తుల సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో బాగంగా ఎంపీ కాన్గల్ గ్రామానికి వచ్చిన సందర్భంగా బండల మీద కాలనీవాసుల ఇబ్బందులు గ్రహించి వారి కోరిక మేరకు ఇచ్చిన సీసీ రోడ్ల నిర్మాణం హామీ ఇచ్చారని తెలి పారు. అదే విధంగా నేడు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, చంద్ర రెడ్డి, కొమురయ్య, డీలర్ వెంకట్ రెడ్డి, నారగౌడ్, స్వామి యాదవ్, ఫీల్డ్ అసి స్టెంట్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



పంజాల కార్తీకకు పీఆర్టీయూ సన్మానం

నవతెలంగాణ-రాయపోల్

ఆవర్తన మూలకాలను అతి తక్కువ సమయంలో కంఠస్థం చేయడంతో ప్రపంచ రికార్డు సృష్టించిన బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పంజాల కార్తికకు పీఆర్టీయూ టీఎస్ రాయపోల్ మండల శాఖ తరపున ఘన సన్మానం చేసి అభినందనలు తెలియజేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి కార్తీక, సలహాదారుడు కొల్కూరి భాస్కర్ రెడ్డిలను సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పంజాల కార్తీక అనే విద్యార్థి 8 మార్చ్ 2025 న చెన్నై, తమిళనాడు రాష్ట్రంలో జరిగిన పోటీలలో ఆవర్తన పట్టికలలోని 118 మూలకాలను 8 సెకండ్ల 85 మిల్లీ సెకండ్లలో చెప్పి ప్రపంచ రికార్డును సృష్టించిన విద్యార్థిని కార్తీకకు రూ.3 వేల ఆర్థిక సహాయంతో పాటు ఒక డిక్షనరీ, డ్రెస్సు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు అంజిరెడ్డి, నాగరాజ్, సుధాకర్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ మండల నాయకులు ఇంద్రసేనారెడ్డి, కనకా రెడ్డి, తులసీదాస్, నాగరాజు, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సస్యరక్షణ చర్యలతో అగ్గి తెగులును అరికట్టాలి

- ఏడీఏ పద్మ, ఏఓ శ్రీనాథ్

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

వరి పైరుకు తీవ్ర నష్టం కలిగించే అగ్గి తెగులును ప్రారంభ దశలోనే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అరికట్టవచ్చని సిద్దిపేట ఏడీఏ పద్మ, మండల ఏఓ బి. శ్రీనాథ్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామంలో అగ్గి తెగులు సోకిన వరి పైరును పరిశీలించి రైతుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రి వేళ ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం, ఆకులపై మంచు ప్రభావం, నత్రజని అధిక వినియోగం వల్ల వరిలో అగ్గి తెగులు వస్తుందని తెలిపారు. ఆకుల పైన నూలు కండె ఆకారంలో బూడిద రంగు మచ్చల చుట్టూ ఇటుక రంగులో ఉండే అగ్గి తెగులు లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించకపోతే తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని సూచించారు. దీని నివారణ కోసం ట్రైసైక్లాజోల్ 120 గ్రా. లేదా ట్రిఫ్లాక్సిస్ట్రోబిన్, టెబుకోనజోల్ 90 గ్రా. ద్రావణాన్ని లేదా పికాక్సిస్ట్రోబిన్, ట్రైసైక్లాజోల్ 400 మి.లీ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేసుకోవాలని సూచించారు.



నూతన చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులకు మహిళల రక్షణ చట్టలు, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి మంగళవారం మండల కేంద్రం కేజీబీవీ పాఠశాలలో అవగాహన కల్పించడం జరిగిందని రాయపోల్ ఎస్ఐ రఘుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్,ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పిల్లలు, మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షీటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ సుగంధాలత, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళ కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుల్ మహేష్,పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యం పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-మద్దూరు



జ్యోతిష్యం పేరుతో వృద్ధుడిని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ ఎల్ శ్రీను, మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామానికి చెందిన ధర్మోజీ నారాయణ, ఇటీవల ఓ టీవీ ఛానల్‌లో వచ్చిన ప్రకటనలో జ్యోతిష్యం చెప్పబడును అనే ప్రకటన చూసి అతను ఆ జ్యోతిష్యునికి నారాయణ, గుంటూరు, జిల్లా పెద్ద కలకలూరు, గ్రామానికి చెందిన దక్షిణం శివయ్య కు ఫోన్ చేసి తన సమస్యలు తీర్చాలని కోరడంతో ఈ సమస్యలు తీర్చాలంటే రూ.50 వేలు పంపించాలని చెప్పడంతో అతను పంపించినట్లు తెలిపారు. మళ్లీ ఆ పూజారినే అతను సంప్రదించడంతో మళ్లీ ఇంకో రూ.50వేలు కొట్టాలి అని చెప్పడంతో మరల రూ.50 వేలు మొత్తం రూ.లక్ష అతనికి కొట్టినట్లు తెలిపారు. పూజ పూర్తి కావాలంటే ఇంకా డబ్బులు పంపించాలని జ్యోతిష్యుడు చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన నారాయణ, సైబర్ క్రైమ్ నెంబర్ కు ఫోన్ చేసి పోలీసులను ఆశ్రయించడంతో మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్, దర్యాప్తు ప్రారంభించి నిందితుడు పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్ గా తరలించినట్లు సిఐ తెలిపారు.

చాలీచాలని జీతాలతో సేవ చేస్తున్నాం

- కావాలని మాపై దుష్ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం
- మీడియా ముందు ఆధారాలతో నిరూపించండి
- గజ్వేల్ లో మెప్మా ఆర్పీల మీడియా సమావేశం

నవతెలంగాణ-గజ్వేల్‌రూరల్



చాలీచాలని జీతాలతో అధిక పనిని చేస్తూ ప్రజలకు అధికారులకు వారిదిగా ఉన్నామని మెప్మా ఆర్పీలు పుట్ట సుభద్ర, జ్యోతి అన్నారు. మంగళవారం మున్సిపల్ పట్టణ ఆర్పీలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారులు చెప్పిన ఎంత పనైనా చేస్తున్నామన్నారు. మాపై పనిగట్టుకుని బద్నాం చేసే విధంగా దుష్ప్రచారం చేసేందుకు కొందరు వ్యక్తులు పేపర్‌లో ప్రచారం చేశారన్నారు. ఇటీవల పలు వార్తా పత్రికలలో ప్రచురితమైన ఆర్పీల దారుణాలు, డ్వాక్రా గ్రూపులో లోన్ కావాలంటే లంచం ఇవ్వాల్సిందే, అనే పదాలు పూర్తిగా అబద్ధం అన్నారు. అబద్ధాలు చెప్పి పేపర్లో ముద్రించేటట్టు కహానీలు చెప్పారన్నారు. ఏ ఒక్కరి దగ్గర నుంచి ఒక్క రూపాయి వసూలు చేసిన శిక్ష అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నెలకు రూ.6 వేల జీతాలతో కాలం వెళ్లదీస్తున్న మాకు సమాజంలో తలెత్తుకొని తిరుగ లేకుండా దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు. పేపర్ ఫోటోలో ఉన్న వ్యక్తుల్లో లోన్ కోసం సంఘంలో ఉన్నది ఒక వ్యక్తి అని మరొక వ్యక్తికి సంఘంతో సంబంధం లేదని స్పష్టం చేశారు. లోన్ల విషయంలో సమయానికి రాకుండా సభ్యులతో కలవకుండా లోన్ తీసుకోకపోవడం వారి మిస్టేకే అన్నారు. బ్యాంకు అధికారికి ఫోన్ చేసి లోను ఆపాలని మేము వచ్చేంతవరకు ఇవ్వవద్దని చెప్పింది వారేనన్నారు. అన్నీ చేసి మాపై బురదజల్లే పని గత తొమ్మిది నెలల నుండి జరుగుతూనే ఉందన్నారు. మీడియా ముఖంగా ఎలాంటి డబ్బులు వసూళ్లకు పాల్పడలేదని అలా ఆధారాలతో సహా నిరూపిం చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తమపై దుష్ప్రచా రం చేసిన వారిపై ఎంత దూరమైన వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు కల్పన, మనోహ రి, సంధ్యారాణి, బాలమణి, పావని, కృష్ణ లీల, లావ ణ్య సుధారాణి, భవాని, అరుణ, రజిని, మమత, వర కుమారి, ఫాతిమా, మసూదన్నిసా, లక్ష్మి, పద్మ, పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక్కరికి జైలు శిక్ష

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌ల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 08 మందికి రూ.10వేల జరిమానాతో పాటుగా, ఒక్కరికి మూడు రోజుల జైలు శిక్షను విధించినట్లు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా, సిద్దిపేట పట్టణం నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిలపై వాహనాలు తనిఖీలు చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని, పట్టుకుని సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా, ఆయన విచారణ చేసి జరిమానా తో పాటు, జైలు శిక్ష ను విధించినట్లు తెలిపారు.

పల్లె వనం..వికృత రూపం

-మందు బాబులకు అడ్డగా గుగ్గీల్ల పల్లె ప్రకృతి వనం

-ఎక్కడికక్కడ మద్యం సీసాలు ధ్వంసం

-ప్రమాదకరంగా పల్లె ప్రకృతి వనం ప్రధాన ద్వారం

నవతెలంగాణ-బెజ్జంకి



గత ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు అహ్లాదాన్ని నింపేలా,సేద తీరేలా పండ్లు, సుంద రీకరణ, నీడనిచ్చే మొక్క లు నాటి స్వచ్ఛ మైన వాతావరణం అందిం చేల, నడకకు ప్రత్యేక దారి ఏర్పాటు చేసి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పంచాయతీ రాజ్ నిధులతో గ్రామీణాభివృద్ధి శాఖ అధ్వర్యంలో గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. నేడు అయా గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ కరువై, మందు బాబులకు నిలయాలుగా మారి చెట్లు ఎండిపోయి వికృత రూపం దాల్చుతున్నాయి.



మండల పరిధిలోని గుగ్గీల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం వికృత రూపానికి నిలువెత్తు నిదర్శంగా కనపడుతోంది. ఈ పల్లె ప్రకృతి వనం మందు బాబులకు, మత్తుకు నిలయంగా దర్శనమిస్తోంది. మందు బాబులు మద్యం తాగిన సీసాలు ఎక్కడికక్కడ ధ్వంసమై అందవిహీనంగా కనపడుతున్నాయి. పల్లె ప్రకృతి ప్రధాన ద్వారం ఊడిపోయి ప్రమాదకరంగా వెలాడుతోంది. ఫెన్సింగ్ ధ్వంసమైంది. పల్లె ప్రకృతి వనంలో రూ.లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్ వెలవెలబోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనానికి మరమ్మతులు చేసి, మందు బాబులపై తగిన చర్యలు తీసుకుని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం అంక్షాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపా ధ్యాయులు కత్తుల రాంరెడ్డి తెలిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. డీఈవోగా చైత్ర, ఎంఈఓ గా శ్రీనిత్, ప్రధానోపాధ్యాయులు గా అస్మిత, ఉపాధ్యాయులు గా హర్షిత, మనస్విని, అశ్విత, హర్షిని, భాను ప్రసాద్, శశివర్ధన్, సాత్విక్ వ్యవహరించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం రాజిరెడ్డి, నారాయణరెడ్డి, సత్యంలు పర్యవేక్షించారు. మండల విద్యాశాఖాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జ్యోతి లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే చక్కటి నడవడిక అలవరచుకోవాలని సూచించారు. భోదనలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నవతెలంగాణ-ములుగు

ములుగు మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొట్యాలలో సోమవారం స్వయం పరిపాలన, మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.కల్పన ఉపాధ్యాయులు కే.నర్సింలు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఇటీవలే పాఠశాలలో సైన్స్ డే ను కూడా ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో వాలంటీర్లుగా పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్

మంగళవారం రాయపోల్ మండలం కృష్ణ సాగర్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి హజరైన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకరోజు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బాధ్యతలను స్వీకరించడంతో విద్యార్థులు ఎంతో సంతోషంగా పాఠశాలకు వచ్చి వారి వారి విద్యాబోధనలను తోటి విద్యార్థులకు అందజేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. హెచ్ఎంగా కె. రిషిక్ కుమార్, తెలుగు ఉపాధ్యాయులు కే. వర్షిని, ఆంగ్లం ఉపాధ్యాయులు డి. హేమాన్య, విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు నాగరాజు, బేగంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న,సిఆర్పిలు ఎల్లా గౌడ్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

